01ATP15F_01ATP15F.qxd 15-03-2026 PM 10:48 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
సోమవారం 16 మార్చి 2026 పేజీలు : 04

# పత్రాల్లోనే ప్రణాళిక.. కేంద్రాల్లో అమలవక..!

- నేటి నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు
- పకడ్బంధీ ప్రణాళికలంటూ ప్రకటనలు
- 227 మంది హాజరయ్యే చోట మరుగుదొడ్లు లేని దుస్థితి
- నియోజకవర్గంలో 20 కేంద్రాల్లో 4,045 మంది విద్యార్థులు



**తాడిపత్రి, మార్చి15,ప్రభాతవార్త:** విద్యార్థి ఉజ్వల భవిష్యత్తుకు తొలిమెట్టు పదో తరగతి. పాఠశాల స్థాయిలో ఎదురయ్యే తొలి సవాలును ధీటుగా ఎదుర్కొనే పబ్లిక్ పరీక్షలకు



యాడికి స్టార్ ప్యారడైజ్ పరీక్ష కేంద్రంలో మరుగుదొడ్ల దుస్థితి

పదో తరగతి విద్యార్థులు సిద్ధమయ్యారు.నేటి నుంచి అంటే ఈ నెల 16వ తేదీ నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. తాడిపత్రి నియోజకవర్గంలోని తాడిపత్రి పట్టణం, తాడిపత్రి మండలం, యాడికి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలాల నుంచి ఈ పబ్లిక్ పరీక్షలకు 4,045 మంది విద్యార్థులు హాజరవనున్నారు. తాడిపత్రిలో 13, యాడికిలో 3, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలాల్లో రెండేసి చొప్పున మొత్తం 20 కేంద్రాలను అధికారులు కేటాయించారు. ఈ పరీక్షల పర్యవేక్షణకు 40 మంది ఛీఫ్, డిపార్ట్‌మెంటల్ అధికారులనే గాక 217 మంది పర్యవేక్షకులను నియమించారు. వీరిలో ఎన్నడూ లేని విధంగా సుమారు 45 మంది ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయులను పర్యవేక్షకులుగా నియమించడం గమనార్హం.

**:20 పరీక్షా కేంద్రాలు..4045 మంది విద్యార్థులు..!**

తాడిపత్రిలో ఎస్పీ మున్సిపల్ ఉన్నత పాఠశాల(300), ప్రభుత్వ ఉన్నత పాఠశాల(200), శ్రీసాయి విజేత ఉన్నత పాఠశాల(300); శ్రీచైతన్య(300), నారాయణ ఈ–టెక్నో పాఠశాల(280), శ్రీవాణి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్(280), జేహెచ్ఆర్ మున్సిపల్ బాలికల పాఠశాల((197),ఎస్ఎస్ఆర్ రోటరీ మున్సిపల్ హైస్కూల్(133), మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల(196), టార్గెట్ ఉన్నత పాఠశాల(250), క్రిస్ట్ ది కింగ్ ఉన్నత పాఠశాల(280), యాడికి ఉన్నత పాఠశాల 'ఎ' కేంద్రం(260), యాడికి ఉన్నత పాఠశాల 'బి' కేంద్రం(263), స్టార్ ప్యారడైజ్ ఉన్నత పాఠశాల(227), పెద్దపప్పూరు ప్రభుత్వ పాఠశాల(203), మౌర్య ఉన్నత పాఠశాల(208), పెద్దవడుగూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల(265), సరస్వతి ఉన్నత పాఠశాల(183) వంతున విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

**:అక్కడ రాయడమే ఓ పరీక్ష..!**

నియోజకవర్గంలోని 20 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 14 కేంద్రాలు ప్రయివేటు పాఠశాలల్లోనే ఏర్పాటు చేశారు. ఫీజుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల సౌకర్యాలపై చూపించిన కొన్ని ప్రయివేటు పాఠశాలల్లో మౌలిక వసతులు చాలా అధ్వాన్నంగా ఉన్నాయి. తాగునీరు, పంకాల సంగతి దేవుడెరుగు కనీసం ఒంటికి, రెంటికి అత్యవసరమైతే ఇంటికి వెళ్లేంత వరకు ఉగ్గపట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని పరీక్షా కేంద్రాల్లోని మరుగుదొడ్లను చూస్తే కొద్ది రోజులు పరీక్షలు రాసి వెళ్లే విద్యార్థులకే నరకం చూపిస్తుంటే ఇక నిత్యం ఆయా ప్రయివేటు పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల పరిస్థితి చెప్పక్కరలేదు. సాధారణ రోజుల్లో పర్యవేక్షణ లేక పట్టించుకోలేదని అనుకోవచ్చు. కనీసం పబ్లిక్ పరీక్షల సందర్భంలోనైనా పరీక్షలకు ముందు గాని, తరువాత గాని, రాసే సందర్భంలో గాని ఒంటికి, రెంటికి వెళ్లాలంటే ముఖ్యంగా బాలికల పరిస్థితి ఏమిటని అధికారులు పట్టించుకోరా అంటూ పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయి అధికారులు ఇలాంటి కేంద్రాల్లో మౌలిక వసతులు గాలికి వదిలేసి పకడ్బంధీ ప్రణాళికలు రచించామని



ఒంటికి, రెంటికి వస్తే ఇంటికి పోయే వరకు ఆగాల్సిందేనా..!

ఉన్నతాధికారులతో ఊదరగొడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. యాడికిలో 227 మంది పరీక్షలు రాసే స్టార్ ప్యారడైజ్‌లోని పరీక్ష కేంద్రమే అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని చెప్పవచ్చు.

**:ప్రయివేటు పాఠశాలల పర్యవేక్షకుల ప్రభావం..!**

చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి పదో తరగతి పబ్లిక్ పరీక్షల పర్యవేక్షణకు ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయులను నియమించడం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. నియోజక వర్గంలోని 20 కేంద్రాల్లో 45 మందికి పైగా ప్రయివేటు ఉపాధ్యాయులను నియమించారు. ప్రతి కేంద్రంలోనూ కనీసం ఇద్దరు, ముగ్గురు ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయులను నియమించడంతో తప్పకుండా ఆ ప్రభావం ఉంటుందనే వాదనలు వినిపిస్తున్నాయి. సరిపడా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ ప్రయివేటు పెత్తనమేంటని, వారు ఏదైనా తప్పుచేస్తే కఠిన చర్యలు తీసుకునే వెసలుబాటు ప్రభుత్వానికి ఉంటుందా అని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పేపరు లీకేజీ వంటి సంఘటనలకు గాని, మాస్ కాపీయింగ్‌కు గాని పాల్పడితే సస్పెన్షన్‌కు గురవుతామనే భయం, బాధ్యత ఉంటాయని, ప్రయివేటు ఉపాధ్యాయులపై ఏమి చర్యలు తీసుకోగలరని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయులు ప్రలోభాలకు గాని, ఒకరి పాఠశాల విద్యార్థులకు మరొక పాఠశాల ఉపాధ్యాయులు సహకరించుకుంటే ప్రభుత్వం విమర్శలకు గురికావాల్సి వస్తుందని ప్రభుత్వ ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రయివేటు ఉపాధ్యాయుల నియామక విషయంలో మా విద్యార్థులను మీరు కాయండి..మీ విద్యార్థులను మేము కాస్తామనేలా పరిస్థితి మారుతుందనే చర్చనడుస్తోంది.

అసౌకర్యాలు, అసంబద్ధ నియామకాల మధ్య జరుగుతున్న ఈ పబ్లిక్ పరీక్షల్లో విజయీభవ అనేలా విద్యార్థులు ఏ స్థాయిలో రాయగలరో వేచి చూడాల్సిందే.

# సంస్కృతి....సాంప్రదాయాలు ప్రతిబింభించేలా గుత్తికోట ఉత్సవాలు

- అంగరంగవైభవంగా గుత్తికోట ఉత్సవాలు - పురాతన వారసత్వాన్ని సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత
- జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, దగ్గుపాటి ప్రసాద్





జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే దగ్గుపాటి హాజరైన దృశ్యం, ఎమ్మెల్యే జయరాం, ఎస్‌టి కమీషన్ సభ్యుడు వెంకటప్ప హాజరైన దృశ్యం, జబర్దస్త్ కళాకారులు మిమిక్రి చేస్తున్న దృశ్యం




ఉత్సవాలకు హాజరైన ప్రజలు , కళాకారులు నృత్యం చేస్తున్న దృశ్యం

**గుత్తి, మార్చి 15 ప్రభాతవార్త** నేటి ప్రజానీకం పురాతన సంసృతి, సాంప్రదాయాలను అలనాటి జ్ఞాపకాలను, పురాతన కట్టడాలను సంరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఎంతైనా వుందని జిల్లా కలెక్టర్ ఆనంద్, గుంతకల్లు, అనంతపురం ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు వెంకటప్ప, తదితరులు పేర్కొన్నారు. పురాతన నేపథ్యం కలిగిన గుత్తికోట ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక ఎంఎల్ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో అశేష ప్రజానీకం నడుమ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతపురం శ్రీనృత్య కళానిలయంకు చెందిన కళాకారులు నిర్వహించిన శివపాదం నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. అనంతరం ఈటీవి జబర్దస్త్ టీం శాంతకుమార్, రైజింగ్ రాజు, మోహన్‌లు ప్రదర్శించిన మిమిక్రి ఆహుతులను మంత్ర ముగ్దులను చేసింది. అదేవిధంగా నృత్య కళానిలయం సంధ్యామూర్తి నిర్వహించిన జానపద నృత్యాలు అలరించాయి. అదేవిధంగా జిల్లా కేంద్రానికి చెందిన కళాకారులు ప్రదర్శించిన గంగమ్మ జాతర, హర్యానా ఫోక్ డ్యాన్స్, గుత్తి కెజిబి విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. అనంతరం ప్రవీణ్ సాహితి అకాడమీ నిర్వహించిన ఆర్కెస్ట్రా మంత్ర ముగ్దులను చేసింది. ఉత్సవాలను పురస్కరించుకుని గుత్తికోటపై జాతీయ జెండాను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడుయాదవ్, డిఆర్ఒ మలోల, జిల్లా టూరిజం అధికారి జయకుమార్‌బాబు, గుంతకల్లు ఆర్డీఒ శ్రీనివాస్, డిఎస్‌పి శ్రీనివాస్, డిఎల్‌డిఒ విజయలక్ష్మి, డిపిఆర్ఒ బాలకొండయ్య, ఏపిఆర్ఒలు సూర్యనారాయణరెడ్డి, వృక్రుద్దీన్, డిఆర్‌డిఏ పిడి శైలజ, డ్వామా పిడి సలీంబాష, జెడ్‌పి సిఇఒ శివశంకర్, హార్టికల్చర్ అధికారి ఉమాదేవి, గుత్తికోట సంరక్షణ సమితి అధ్యక్షులు విజయభాస్కర్‌చౌదరి, మున్సిపల్ కమీషనర్లు లక్ష్మీదేవి, జబ్బార్‌మియా, తహశీల్దార్ పుణ్యవతి, ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్, డిఎస్‌డిఒ మంజుల, ఆర్కియాలజీ ఏడి స్వామినాయక్, తహశీల్దార్లు హరికుమార్, ఉషారాణి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్లు ప్రజలను ఆకర్షించాయి. ఉత్సవాలను పురస్కరించుకుని రవితేజ నారాయణస్వామి, రవిలు ప్రజలకు భోజన వసతి కల్పించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా డిఎస్‌పి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్బన్ సిఐ రామారావు, ఎస్ఐలు సురేష్‌బాబు, అమీర్‌ఖాన్‌లు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

# నగర పరిశుభ్రత కోసం 'స్పెషల్ డ్రైవ్'

-100 రోజుల యాక్షన్ ప్లాన్ -వర్షాకాల సీజన్‌ను అధిగమించడమే లక్ష్యం -కమిషనర్ జస్వంత రావు





పిచ్చిమొక్కలను తొలగిస్తున్న సిబ్బంది , రోడ్డు ప్రక్కన మట్టిదిబ్బను తరలిస్తున్న సిబ్బంది , నగరపాలక సంస్థ ఫోటో

**అనంతపురం మార్చి15 ప్రభాతవార్త** నగర పరిశుభ్రత కోసం ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ప్రారంభమైంది. 100 రోజుల యాక్షన్ ప్లాన్ రూపొందించి రాబోయే వర్షాకాలంలో నగర ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తుగా ఈ వేసవిలో పూర్తిస్థాయిలో మట్టి దిబ్బలు, మురికికాల్వల్లో పూడికతీతకు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జస్వంత రావు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నగర శివారు ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులు మట్టిదిబ్బలు, చెత్తకుప్పలు, పిచ్చిమొక్కలు వంటి వాటిని పూర్తిగా తొలగించి తరలించేందుకు ప్రణాళికను రూపొందించి 'స్పెషల్‌డ్రైవ్' పేరుతో ఒక్కొక్క డివిజన్‌కు రెండు రోజులు చొప్పున 50 డివిజన్లలో 100 రోజులు కేటాయించి ఎక్కడా చెత్తా చెదారం లేకుండా చేయడమే ప్రధాన లక్ష్యం. ప్రధానంగా మురికివాడల్లో పిచ్చిమొక్కలు తొలగించడంతో పాటు కాలువల్లో పేరుకుపోయిన పూడికను తీసివేస్తారు. ఇప్పటికే గుత్తిరోడ్డు, ఆర్టీసి బస్టాండు రోడ్డు, ఎర్రనేల కొట్టాలు, లెక్చరర్స్ కాలనీల్లో ఈ స్పెషల్ డ్రైవ్ పూర్తి చేశారు. ఈ ప్రక్రియను ప్రతిరోజూ కమిషనర్ సందర్శిస్తూ సంబంధిత శానిటేషన్ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ఎక్కడా చెత్త కుప్పలు, మట్టిదిబ్బలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఆయా డివిజన్లకు కేటాయించిన రెండు రోజుల్లో వారి పరిధిలో వున్న వాటిని పూర్తిగా తరలించేలా సంబంధిత శానిటరీ సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేశారు. రాబోయే వర్షాకాలంలో మురికికాల్వల్లో మురికినీరు, వర్షపు నీరు సజావుగా ప్రవహించేందుకు ముందస్తు ప్రణాళికతో ఈ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో ఎంతో ఉపయోగపడుతుంది. ప్రధాన మురికికాలువలతో పాటు మధ్యతరహా కాలువల్లో పూడికతీతకు ఆయా ప్రాంతాల్లో వున్న కాలువలను ఇప్పటికే గుర్తించి సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల ద్వారా పూడికతీతకు రెండు, మూడు రోజుల్లో టెండర్లు ఆహ్వానించడానికి రంగం సిద్ధం చేశారు. గతంలో పాలకులు, అధికారయంత్రాంగం ఇలాంటి ప్రణాళికను రూపొందించి ముందస్తు జాగ్రత్తలు తీసుకున్న దాఖలాలు లేవు. నగర కమిషనర్‌గా జస్వంత రావు బాధ్యతలు చేపట్టి కేవలం నెల రోజుల్లోనే నగర ప్రజల సంక్షేమానికి, సంరక్షణ కోసం మిగతా 4 లో...

# మెగా జాబ్ మేళా మెగా సక్సెస్..

- బాలయ్య సౌజన్యంతో 120 కంపెనీలు రాక - 5323 హాజరు.. 1903 మందికి ఉద్యోగాలు





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం , ఇంటర్వ్యూలకు హాజరైన వేలాదిమంది , వాలంటీర్ నాయకులను సత్కారం

**హిందూపురం మార్చి 15 ప్రభాతవార్త** హిందూపురంలో మొట్ట మొదటిసారి ఎమ్మెల్యే నందమూరిబాలకృష్ణ సౌజన్యంతో జిల్లా స్థాయిలో జరిగిన మెగా జాబ్ మేళా సూపర్ హిట్ అయింది. ఎమ్మెల్యేకార్యదర్శులు డాక్టర్ సురేంద్ర బాబు, శ్రీనివాసరావు, వీరయ్య,బాలాజీల ఆధ్వర్యంలో స్థానిక సప్తగిరి కళాశాలలో ఆదివారం పెద్దఎత్తున కార్యక్రమం నిర్వహించారు. కళాశాల అధినేత మాజీమంత్రి పల్లెరఘునాథ్‌రెడ్డి, మడకశిరఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, ఎంపీ పార్థసారథి, మున్సిపల్‌చైర్మన్ రమేష్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు పొరుగునే ఉన్న బెంగళూరుకు చెందిన దాదాపు 120కంపెనీల ప్రతినిధులుఇంటర్వ్యూలు నిర్వహించేందుకు ఇక్కడికివచ్చారు. జిల్లావ్యాప్తంగా నిరుద్యోగులు 5323 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా 1903 మందికి ఉద్యోగాలు లభించినట్లు నిర్వాహకులుతెలిపారు. జాబ్ మేళా ప్రారంభంలో నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్యోగాల కల్పన కోసం అనేక కంపెనీలను రాష్ట్రానికి తీసుకొస్తున్నారని చెప్పారు. రాష్ట్ర స్థాయిలోనే బాలయ్య ఆధ్వర్యంలో ఈ తరహా ఇంటర్వ్యూలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. దాదాపు రెండు వారాలుగా జిల్లా ప్రభుత్వ యంత్రాంగం తో పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన యువ నాయకులు వివిధ ప్రాంతాల్లో పర్యటించి నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి కార్యక్రమం విజయవంతం చేశారని పేర్కొంటూ వారిని ఘనంగా సత్కరించారు. ఆర్డిఓ ఆనంద్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, డిఎస్పి మహేష్, సిఐలు తదితరులు పాల్గొన్నారు.

# ఏళ్ల సమస్యకు.. 8నెలల్లో పరిష్కారం.. ఎట్టకేలకు రాప్తాడు రైల్వే బ్రిడ్జి ప్రారంభం

- అట్టహాసంగా బ్రిడ్జి ప్రారంభోత్సవం.. భారీగా పాల్గొన్న ప్రజలు - బ్రిడ్జిని పరిశీలించిన ఎమ్మెల్యే సునీత, పరిటాల శ్రీరామ్




రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత , టిడిపి నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే పరిటాల సునీత

**రాప్తాడు, మార్చి 15 ప్రభాతవార్త** గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో మంజూరై పనులు ప్రారంభించిన అనంతరం అధికారంలోకి వచ్చినవైకాపా ప్రభుత్వ హయాంలో కమీషన్ల కోసం ఆగిపోయిన రాప్తాడు ఫోర్ లైన్ రైల్వే బ్రిడ్జిని కేవలం 8నెలలలోపే పూర్తి చేశామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు.ఆదివారం బ్రిడ్జిప్రారంభోత్సవం ముందు ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించగా, ఆతర్వాత నాయకులు,కార్యకర్తలు, స్థానిక ప్రజలు నడుమ పూజలు నిర్వహించి బ్రిడ్జిని ఎమ్మెల్యే సునీత ప్రారంభించారు. ఎమ్మెల్యే సునీత స్వయంగా బ్రిడ్జిపై ప్రదర్శనగా వెళ్లారు. ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో 2017లో 74కోట్ల రూపాయలతో బ్రిడ్జి మంజూరైందన్నారు. 1.8కిలోమీటర్ల మేర 42, 44వ జాతీయ రహదారులను కలపడంతో పాటు బెంగళూరు, హిందూపురం, పెనుగొండ, మడకశిర, పావగడ, రాప్తాడు నియోజకవర్గాల ప్రజలు అనంతపురం పట్టణంలోకి రావడానికి బళ్లారి, గుత్తి, రాప్తాడు వైపుల నుంచి వచ్చే వాహనాలు తిరుపతి, చెన్నై వెళ్లడానికి ఈ బ్రిడ్జి ఉపయోగపడేలా ప్లాన్ చేశారన్నారు. 2017లో పనులు ప్రారంభించగా.. 55కోట్ల నిధులతో తమిళనాడుకు చెందిన ఒక కాంట్రాక్టర్ ఒప్పందం చేసుకొని ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. అయితే 70శాతంపనులు పూర్తిఅయ్యాక.. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వంలో ఈ పనులు ఆగిపోయాయన్నారు. ఆ కాంట్రాక్టర్ మిగిలిన పనులను పూర్తి చేయనందున పనులను రద్దు చేశారన్నారు. ఇలాంటి సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఒప్పించి రూ.25కోట్ల నిధులు తీసుకొచ్చామన్నారు. ఎస్కేసీ కాంట్రాక్టర్లు కేవలం 8నెలల్లో పై బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేశారన్నారు. ప్రస్తుతం ఈ బ్రిడ్జి నిర్మాణం వల్ల బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ మూడు రహదారులను కలిపే విధంగా ఉంటుందన్నారు. బ్రిడ్జి అనుకున్న సమయానికన్నా ముందే పూర్తిచేసిన కాంట్రాక్టర్లను ఎమ్మెల్యే సునీత కృతజ్ఞతలు తెలిపి అభినందించారు. రోడ్డు బాగా ఉందని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, బ్రిడ్జిపై అతివేగంగా వెళ్లవద్దని, ఎమ్మెల్యే సునీత ప్రయాణికులకు, వాహనదారులకు సూచించారు.

# ఆధ్యాత్మిక గురువు డాక్టర్ సాయికాలేశ్వర్ సేవలు చిరస్మరణీయం

- 14వ వర్ధంతి సందర్భంగా85 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ - కాలేశ్వర స్వామి పెనుకొండకు ఎన్నో సేవలు అందించారు - ఆయన బాటలోనే నడుస్తూ ప్రజలకు సేవలందిస్తున్నాం - షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్మన్ శిల్పఅనుపాటి




సాయి కాలేశ్వర్ కు నివాళులర్పిస్తున్నశిల్పఅనుపాటి, ట్రస్ట్ సిబ్బంది ,కంటి అద్దాలు అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ శిల్పఅనుపాటి

**పెనుకొండ మార్చి15 ప్రభాతవార్త.** ఆధ్యాత్మిక గురువు డాక్టర్ సాయికాలేశ్వర్ సేవలు శిరస్మరణీయమని షిరిడి సాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్మన్ శిల్ప అను పార్టీ తెలిపారు. సాయికాలేశ్వర్14వ వర్ధంతి సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ శిల్పానుపాటి ఆదివారం శివసాయి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సాయికాలేశ్వర్ సమాధి వద్ద నివాళు లర్పించారు. సందర్భంగా షిరిడి సాయి గ్లోబల్ ట్రస్ట్ సభ్యులందరికీ వస్త్రదానం ద్వారా నూతన వస్త్రాలను అందించారు. నవ్యశ్రీ ఉచిత కంటి ఆసుపత్రి నందు ఆపరేషన్లు జరిగిన85 మందికి ఉచితంగా మేలు రకం కంటి అద్దాలు అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిల్పానుపాటి మాట్లాడుతూ స్వామి వారు పెనుకొండకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని,మేము కూడా నిరంతరం ఆయన బాటలో నడుస్తూ ప్రజలకు సేవలందిస్తున్నాం అని తెలిపారు.సాయికాలేశ్వర స్వామి 2007లో నవ్యశ్రీ ఉచిత కంటి ఆసుపత్రినీ స్థాపించినప్పటినుండి అనేక మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసి కంటి అద్దాలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం ఆయన బాటలో ప్రతి సంవత్సరం ఆయన జయంతి సందర్భంగా మెగా మెడికల్ క్యాంపులు వస్తున్నామని, ప్రతి సంవత్సరం దాదాపు100 మందికి కంటి ఆపరేషన్లు చేయించి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఫీజులు చెల్లిస్తూ ఉన్నత చదువులు షిరిడి సాయి గ్లోబల్ ట్రస్ట్



కంటి ఆపరేషన్ చేయించుకున్న వారితో ట్రస్ట్ చైర్మన్ శిల్పా

ద్వారా కార్పొరేట్ విద్య అందించడం జరిగిందని తెలిపారు. హెచ్ఐవి బాధితులకు,అనేకమంది గర్భవతులకు పౌష్టికాహారం అందించడం జరిగిందని ఇలా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపా రు.ఈకార్యక్రమంలో వివిధ దేశాల నుండి వచ్చిన స్వామి భక్తులు షిరిడిసాయి గ్లోబల్ ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ



విద్యార్థు లకు పరీక్ష సామాగ్రిని పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్

**పుట్టపర్తి (కల్చరల్), మార్చి 15, ప్రభాతవార్త**

10 వ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు జిల్లా కలెక్టర్ శాంప్రసాద్ ఆదివారం పరీక్ష సామాగ్రిని పంపించేశారు. పుట్టపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు జిల్లా కలెక్టర్ పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. తాను ఈ పాఠశాలను దత్తత తీసుకున్నందున, విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదివి జిల్లాలోనే ఉత్తమ ఫలితాలను సాధించి పాఠశాల పేరు నిలబెట్టాలని కోరారు. ఫలితాలు వెలువడిన తర్వాత పాఠశాలను మరొకసారి సందర్శిస్తానని, అగ్రస్థానంలో నిలిచిన విద్యార్థులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తానని వాగ్దానం చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ, పరీక్షా సమయంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా ప్రశ్నాపత్రాన్ని అర్థం చేసుకోవడం. సమయ పాలన పాటిస్తూ సమాధానాలను ఆకర్షణీయంగా ప్రెజెంట్ చేయడం. ఒత్తిడికి లోనవ్వకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## వయోజన విద్య పరీక్షా కేంద్రాలను పరిశీలించిన డిప్యూటీ ఎంపిడిఒ

**లేపాక్షి, మార్చి 15 ప్రభాతవార్త**



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ

మండల పరిధిలోని కల్లూరు, కొండూరు గ్రామాల్లో ఆదివారం 'ఉల్లాస్ అక్షరాంధ్ర" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వయోజన విద్య తుది పరీక్షలను లేపాక్షి డిప్యూటీ ఎంపిడిఒ ఎస్.శ్రీనివాస్ పరిశీలించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఈ పరీక్షా కేంద్రాలను ఆదివారం ఆయన సందర్శించి, పరీక్షల నిర్వహణ తీరునుపర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. చదువుకు వయసుతోసంబంధంలేదని, అక్షరాస్యత ద్వారానే సామాజిక చైతన్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పరీక్షలకు హాజరైన వయోజనుల ఉత్సాహాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యా వాలంటీర్లు పాల్గొన్నారు.

## రేపటినుండి "రైతన్న మీకోసం" కార్యక్రమం

**బెలుగుప్ప, మార్చి 15 ప్రభాతవార్త**



మండల వ్యవసాయ అధికారి పృథ్వి సాగర్

రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరము ఖరీఫ్ పంట కాలానికి సంబంధించి ముందస్తు సన్నద్ధంలో భాగంగా ఈనెల 16 నుండి 25 వరకు రైతు సేవా కేంద్రం పరిధిలోని గ్రామాలలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి పృథ్వి సాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది ప్రతి రోజు 90 రైతు కుటుంబాలను సందర్శించి ఖరీఫ్ సన్నద్ధతను వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి రైతుకు ఎల్‌నినో/వర్షా బావ పరిస్థితిలు ప్రభావం, ప్రకృతి వ్యవసాయం సేద్యం సుస్థిర సాగు ప్రత్యామ్నాయం వంటి విషయాలపై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం ఈనెల 25వ తారీఖున గ్రామ సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కావున ఈ కార్యక్రమంలో రైతులు నాయకులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

## 10వ తరగత పరీక్షలకు సర్వం సిద్ధం

### - మండల విద్యాధికారి హరి కృష్ణ



ఎంఈఓ హరికృష్ణ

**బెలుగుప్ప, మార్చి 15 ప్రభాతవార్త**

మండల కేంద్రంలో 10వ తరగతి పరీక్షలకు ఈ నెల 16వ తేది నుంచి ప్రారంభం కానున్నట్లు మండల విద్యాధికారి హరికృష్ణ విలేకర్లకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 448 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామని, రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, జిల్లా పరిషత్ పాఠశాలలో 230, శ్రీనివాస విద్యానికేతన్ 218 మంది పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు సమయానికి గంట ముందే హాలుకు హాజరు కావాలని సూచించారు.

## నేటి నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం

### విద్యార్థులు గంటముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఉన్నతాధికారుల ఆదేశం

**శెట్టూరు, మార్చి 15 ప్రభాతవార్త**



మండల విద్యాశాఖ అధికారి వాణిదేవి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నేటినుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో మండల కేంద్రంలోని శెట్టూరులో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల కోసం రెండు ఏపీ.ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశామని మండల విద్యాశాఖ అధికారులు శ్రీధర్, వాణీదేవీలు తెలిపారు. ఈ సందర్బంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు427మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నట్లు అధికారులు తెలిపారు. బాలురు207మంది బాలికలు220మంది ఉన్నట్లు వివరించారు.ఇందులో రెగ్యులర్ 423మంది విద్యార్థులు ఉండగా ప్రయివేటు విధానంలో22మంది విద్యార్థులు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. అయితే ఈనెల16 నుంచి ఏప్రిల్01వరకు ఉదయం9:30గంటల నుంచి12:45వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు ఉదయం8:30గంటల నుంచి పరీక్షా కేంద్రంలో రిపోర్ట్ చేయాలని10:00గంటల తర్వాత ఎవ్వరినీ లోనికి అనుమతించబోమని పరీక్షా విభాగం పేర్కొంది.విద్యార్థులకు సర్వం సిద్ధం చేశామని విద్యార్థులు ఖచ్చితంగా ఒరిజినల్ హాల్ టికెట్ తో పరీక్షకు హాజరు కావాలన్నారు. ఫోన్, స్మార్ట్ వాచ్, క్యాలిక్యులేటర్ లు అనుమతించబోమని పరీక్షలవిభాగం స్పష్టం చేశారు.

## ఆనంద్ గ్యాస్ అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

**హిందూపురం టౌన్ మార్చి 15 ప్రభాతవార్త**



గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో

గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులకు గ్యాస్ అధిక ధరలకు విక్రయిస్తే చట్టవరమైన చర్యలు తీసుకుంటామని పెనుగొండ ఆర్డిఓ ఆనంద్ హెచ్చరించారు. ఆదివారం హిందూపురం పట్టణం లోనే పిఎస్ఎన్ఆర్ కంబైన్స్, ఇండియన్ గ్యాస్ ఏజెన్సీల కార్యాల యాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ యుద్ధం కారణంగా గ్యాస్ కొరత ఉందని అపోహలు సృష్టించవద్దని మనకు గ్యాస్ కొరత లేదని గృహ వినియోగదారులకు సరిపడా గ్యాస్ మన దగ్గర ఉందని అన్నారు. గ్యాస్ వినియోగదారులు గృహ వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా గ్యాస్ సరఫరా చేయాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో గ్యాస్ కొరత ఉన్నట్లు వస్తున్న వార్తలు అపోహలు మాత్రమేనని అన్నారు. ఏజెన్సీలు కృత్రిమ కొరతల సృష్టించి వినియోగదారులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్డీవో వెంట సివిల్ సప్లైస్ డిప్యూటీ తాసిల్దార్ హారతి, అధికారులు సిబ్బంది ఉన్నారు.

## విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి



మృతి చెందిన జయచంద్ర రెడ్డి

**హిందూపురం టౌన్ మార్చి 15 ప్రభాతవార్త**

హిందూపురం రూరల్ పరిధిలోని కిరికెర పంచాయతీ బసవనపల్లి గ్రామంలో విద్యుత్ షాక్ తగిలి జయచంద్ర రెడ్డి 58 మృతి చెందాడు. గ్రామంలోని శివాలయంలో విద్యుత్ సరఫరా లేని కారణంగా ఆలయ కమిటీ సభ్యుడైన జయచంద్ర రెడ్డి పక్కనే ఉన్న ట్రాన్స్ఫార్మర్ నందు కనెక్షన్ ఇస్తుండగా ప్రమాదవశాత్తు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు.

## రాంపురంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**కంబదూరు, మార్చి 15, ప్రభాత వార్త**



క్రీడాకారులతో ఉపాధ్యాయుడు బద్దే నాయక్

కంబదూరు మండలం రాంపురంలో ఆదివారం గ్రామీణ యువతను ప్రోత్సవించడమే లక్ష్యంగా క్రికెట్ టోర్నమెంట్ ను ఉపాధ్యాయుడు, ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ ప్రారంభించారు. యువత కోరిక మేరకు టోర్నమెంట్ కు అవసరమైన క్రికెట్ కిట్లను ఆయన సొంత నిధులతో అందజేశారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడా స్ఫూర్తిని చాటాలని ఆయన పిలుపునిచ్చారు. తక్షణమే స్పందించి సాయం చేసిన బద్దే నాయక్ కు గ్రామ యువత కృతజ్ఞతలు తెలిపారు.

## నేటినుండి 10వతరగతి పరీక్షలు

**బ్రహ్మసముద్రం మార్చి 15 ప్రభాతవార్త**

మండల కేంద్రం నందు జిల్లాపరిషత్ ఉన్నంత పాఠశాల. మరియు అంబేద్కర్ గురుకుల పాఠశాలరెండు సెంటర్ల యందు ఉదయం 9 30నుండి 12.45వరకు పరీక్ష నిర్బహించబడు నని మండల విద్యాశాఖ అధికారి ఓబులేశు కృష్ణ నాయక్ తెలియ చేసారు గురుకుల పాఠశాల యందు 200మంది విద్యార్థులు మరియు. జిల్లాపరిషత్ పాఠశాలయందు 183.మంది రెగ్యులర్. 5మంది కంపార్టు మెంటల్ విద్యార్థులుపరీక్ష కు హోజరవుతా రని తెలియచేసారు. కావున విద్యార్థులు ఉదయం 9గంటలకే పరీక్షకేంద్రాల వద్దకు చేరుకోవాలని తెలియచేసారు.

## గ్యాస్ కొరత వదంతులు నమ్మొద్దు

### కళ్యాణదుర్గం ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ప్రొప్రైటర్ తిప్పేస్వామి స్పష్టం

**కళ్యాణదుర్గం, మార్చి 15 ప్రభాతవార్త:**

పట్టణంతో పాటు నియోజకవర్గ పరిధిలో గ్యాస్ కొరత ఉందంటూ సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాల్లో ఎలాంటి నిజం లేదని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కళ్యాణదుర్గం ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ప్రొప్రైటర్ తిప్పేస్వామి తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన గ్యాస్ సరఫరాపై నెలకొన్న అపోహలను ఖండించారు. గృహ వినియోగ (డొమెస్టిక్) గ్యాస్ సిలిండర్ల సరఫరా యథావిధిగా కొనసాగుతోందని, ఏజెన్సీ వద్ద తగినన్ని నిల్వలు ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం కేవలం కమర్షియల్ గ్యాస్ సరఫరాలో మాత్రమే స్వల్ప అంతరాయం ఏర్పడిందని, అది కూడా వారం రోజుల్లో పూర్తిగా సర్దుకుంటుందని వెల్లడించారు. గ్యాస్ బుకింగ్ సమయంలో ఓటీపీ (వీగిశ) రాకపోవడం లేదా కన్ఫర్మేషన్ మెసేజ్ ఆలస్యం కావడం సాంకేతిక కారణాల వల్లనే జరుగుతుందని తెలిపారు. దాన్ని గ్యాస్ కొరతగా భావించవద్దని వినియోగదారులను కోరారు. ఒకవేళ బుకింగ్ సమయంలో ఓటీపీ రాక ఇబ్బంది పడితే ఒకటి రెండు సార్లు ప్రయత్నించాలన్నారు. లేకపోతే నేరుగా గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాన్ని సంప్రదించి వివరాలు ఇచ్చి సిలిండర్ పొందవచ్చని సూచించారు. రాబోయే ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో గ్యాస్ దొరకదనే భయాలు అవసరం లేదని, నిరంతర సరఫరా కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా గ్యాస్ సరఫరాపై ప్రభావం పడుతుందనే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని తిప్పేస్వామి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఉగాది పురస్కారాలు ప్రధానం



ఉగాది పురస్కారాలు అందుకున్న వారితో సంస్థ అధ్యక్షుడు ఎం.బి. మహేష్ బాబు, తదితరులు

**అనంతపురం రూరల్, మార్చి 15, ప్రభాతవార్త**

ఆదివారం నగరంలోని యాపిల్ గార్డెన్ ఫంక్షన్ హాల్ నందు మహా యోగ అండ్ కల్చరల్ ట్రస్ట్ వారి చేత మహిళా పురస్కారంలో ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గౌరవ అధ్యక్షురాలు ఎం.సునామబాయి చేతుల మీదుగా అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు, యోగ గురువు ఎంబి మహేష్ బాబు అతిథలను సత్కరించారు. ఈ కార్యక్రమానికి సెంట్రల్ యూనివర్సిటీ నుండి ప్రణతి, ఎస్కే యూనివర్సిటీ సమత,ఆర్ట్ ఆఫ్ లివింగ్ మమత,గవర్నమెంట్ హాస్పిటల్ స్టాఫ్‌నర్స్ నోని, శ్రీదేవి, రాజంపేట అన్నమయ్య కళాశాల నుండి నవనీత, నన్నిలాక్షి, ఎస్‌బిఐ శాంతి, రేష్మ, శ్రీవిద్య శోభారాణి, రాధా మహిళా మండలి తులసి, కూచిపూడి నృత్యకారిణి ఆదిలక్ష్మి, డాక్టర్లు, ఇంజనీర్లు, అలానే యోగ టీచర్లు, డాన్స్ టీచర్లు తదితరులు పాల్గొనడం జరిగినది.

## నేటి నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు

### -ఉరవకొండలో 5 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

### -పరీక్షలు రాయనున్న 1,253 మంది విద్యార్థులు

### -గంట ముందే పరీక్షా కేంద్రం చేరుకోవాలంటున్న అధికారులు

**ఉరవకొండ, మార్చి 15 ప్రభాతవార్త**



పరీక్షా కేంద్రంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బల్లలు

10వ తరగతి పరీక్షలు నేటి నుంచి (సోమవారం) ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 1వ తేదీతో ముగియనున్న పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాన్నం 12.45 గంటల వరకు జరుగనుండగా ఉరవకొండ పట్టణంలో 5 పరీక్షా కేంద్రాలను మండల విద్యాశాఖ ఏర్పాటు చేసింది. ఇందులో మూడు ప్రభుత్వ పాఠశాలలు, రెండు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిలో మొత్తం 1,253 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. స్థానిక ఎస్.కె.ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో (కోడ్: 65073) 250 మంది, జిల్లా పరిషత్ సెంట్రల్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో (కోడ్: 65074) 250 మంది, జెడ్పీ బాలికోన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో (కోడ్: 65075) 244 మంది, వివేకానంద ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ పరీక్షా కేంద్రంలో (కోడ్: 65076) 250 మంది, ఏవీఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల పరీక్షా కేంద్రంలో (కోడ్: 65077) 259 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. 16న సోమవారం ఫస్ట్ లాంగ్వేజ్ తెలుగు, 18న బుధవారం సెకండ్ లాంగ్వేజ్ హిందీ, 21న శనివారం థర్డ్ లాంగ్వేజ్ ఇంగ్లీష్, 23న సోమవారం మ్యాథమెటిక్స్, 25న బుధవారం ఫిజికల్స్ సైన్సు, 28వ శనివారం బయోలాజికల్ సైన్సు, 30న సోమవారం సోషియల్ స్టడీస్ పరీక్ష జరుగనుంది. పరీక్షల కోసం ప్రతి పరీక్షా కేంద్రంలో బల్లలను ఏర్పాటు చేశారు. వేసవి ఎండల నేపథ్యంలో పరీక్షా గదిలో గాలి, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకున్నారు. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## "పచ్చ"ని నేతల మధ్య.... ప్రజలకు "పచ్చా"ని నీళ్లు

### -చలివేంద్రాన్ని ప్రారంభించిన...నారా లోకేష్ యువదళం వ్యవస్థాపకులు పచ్చా అశోక్ -హాజరైన మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, జిల్లా కార్యదర్శి నరేష్ -గోరంట్లలో లోకేష్ యువదళం పేరుతో....గోరంట్ల బస్‌స్టాండ్‌లో చలివేంద్రం ఏర్పాటు

**గోరంట్ల, మార్చి 15 ప్రభాతవార్త**




చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న టిడిపి నేతలు



కార్యక్రమంలో లోకేష్ యువదళం వ్యవస్థాపకులు అశోక్ బృందం

వేసవికాలంలో పెరుగుతున్న ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు గోరంట్లలో లోకేష్ యువదళం ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రం ద్వారా ప్రయాణీకులు, స్థానిక ప్రజలు ,కార్మికులకు చల్లని తాగునీరు అందుబాటులో ఉంచారు. వేసవి కాలంలో ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు లోకేష్ యువదళం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, లోకేష్ యువదళం అధ్యక్షుడు పచ్చా అశోక్, టిడిపి జిల్లా కార్యదర్శి నరేష్‌కుమార్, గోరంట్ల మేజర్ సర్పంచు సరోజ నాగేనాయక్, సింగిల్ విండో అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, నిమ్మల విద్యాధరణి, కసిరెడ్డిపల్లి రాజారెడ్డి, మెడికల్ స్టోర్ శ్రీనివాసులు, పసుపులేటి శ్రీనివాసులు, అనుమోలు హరి, మాజీ సర్పంచు పట్టాభి రామయ్య, రంగప్ప, కృష్ణమూర్తియాదవ్, నరసింహప్ప, వృషభ దేవుడు, ప్రతాప్‌నాయుడు, బాలకృష్ణనాయుడు, చాంద్‌బాష. శ్రీశైలం శ్రీనివాసులు, అది, నరేంద్రరాయల్, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దు -ఎస్ఐ



ఎస్ఐ సురేష్‌బాబు మాట్లాడుతున్న దృశ్యం

**గుత్తి, మార్చి 15 ప్రభాతవార్త**

ప్రజలు గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ సురేష్‌బాబు సూచించారు. ఆదివారం గుత్తి పట్టణంలో ఆపరేషన్ వజ్ర ప్రహార్ కార్యక్రమం మేరకు పలు కాలనీల్లో పోలీసుల బృందం విస్తృతంగా పర్యటించింది. ఈ సందర్భంగా డిఎస్పి శ్రీనివాస్, అర్బన్ సిఐ రామారావు ఆధ్వర్యంలో ముగ్గురు సిఐలు, ఏడు మంది ఎస్ఐలు, 8 మంది ఏఎస్ఐలతో పాటుగా దాదాపు 50 మంది పోలీస్ సిబ్బంది అనుమానిత ప్రాంతాలు, అద్దె ఇళ్లు, లాడ్జిలు, బస్టాండు, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వ్యవహారంలో ప్రజానీకం స్పందించాలన్నారు. సమాచారం తెలిసిన వారు టోల్ ఫ్రీ నెంబర్ 1972కు సమాచారం అందించాలని వారు కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. అదేవిధంగా అనుమానితులు, పాత నేరస్తులు, గృహాలను తనిఖీ చేశారు.

## తల్లి జ్ఞాపకార్థం ఆగ్రామానికి బోరు తవ్వించారు

### - 135 బస్తాల బియ్యాన్ని పేదలకు పంపిణీ

**అగళి, మార్చి 15 ప్రభాతవార్త**



పేదలకు బియ్యాన్ని పంపిణీ చేస్తున్న జడ్పీటిసి

నందరాజనవల్లి గ్రామ ప్రజల దాహార్తిని తీర్చాలన్న ఉద్దేశ్యంతో పాటు దివంగత పూజారి కరియమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు పూజారి చిక్కన్న, కరియన్న, వారి కొడుకు కరియన్న, ఆ గ్రామానికి బోరు తవ్వించడంతోపాటు పంపు సెట్టును తవ్వించి గ్రామానికి దాహార్థిని తీర్చిన గొప్ప మనస్సున్న మనుషులు. అంతేకాకుండా ఆదివారం వారి తల్లి జ్ఞాపకార్థం నందరాజనపల్లి కరియమ్మ గుడి వద్ద పేదలకు 135 బస్తాల బియ్యాన్ని జడ్పీటిసి ఉమేష్ చేతులు మీదుగా పేదలకు పంపిణీ చేసి, తమ దాన గుణాన్ని చాటుకున్నారు. గ్రామంలో ఉన్న కరియమ్మ దేవతకు పూజారు వారు. వారి తల్లి జ్ఞాపకార్థం ఇలాంటి మంచి పని చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ బియ్యం పంపిణీ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాస్‌మూర్తి, మండల ఉపాధ్యక్షులు గాయత్రి హేమంత్, సర్పంచు లింగరాజు, మంజునాథ్, హరీష్, మాజీ సర్పంచు లింగరాజు, రాము, కరియన్న, భీమన్న, ఈరకాటప్ప గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేటి నుంచి 6 రోజులపాటు 'రైతన్న మీకోసం' కార్యక్రమం

### -వ్యవసాయశాఖ ఉరవకొండ సహాయ సంచాలకులు ఎస్.సత్యనారాయణ

**ఉరవకొండ, మార్చి 15 ప్రభాతవార్త**



ఉరవకొండ ఏడీఏ ఎస్.సత్యనారాయణ

ఈనెల 16వ తేదీ నుండి 6 రోజుల పాటు 'రైతన్న మీకోసం' కార్యక్రమం ప్రతి రైతు సేవా కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని వ్యవసాయశాఖ ఉరవకొండ సహాయ సంచాలకులు ఎస్.సత్యనారాయణ ఆదివారం తెలిపారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో ముఖ్యంగా వ్యవసాయంలో పంచసూత్రాలైన నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ సాయం అంశాలపై రైతుల్లో అవగాహన పెంచడం జరుగుతుందన్నారు. ఎల్‌నినో ప్రభావంవల్ల తూర్పు పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడం ద్వారా వర్గీకరించబడిన వాతావరణ పరిస్థితులు, దీని ప్రభావం ద్వారా భారతదేశంలోని 2026 సంవత్సరంలో వెచ్చని వేసవి, అస్థిర ఋతుపవన వర్షాలకు ముప్పు కలిగించే ఎల్‌నినో పరిస్థితుల సంభావ్యత 50 నుంచి 70శాతం సూచిస్తున్నాయన్నారు. వ్యవసాయ ఉత్పాదకతను తగ్గించి పెద్ద శాశ్విత నష్టాన్ని కలిగించే అవకాశాలు ఉన్నాయన్న అంశంపై రైతులకు సమాచారాన్ని చేర్చడం జరుగుతుందన్నారు. ఇటువంటి వాతావరణ పరిస్థితుల్లో విత్తనగుళికలు, విత్తనబంతులు (పీఎండిఎస్ ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్స్) మల్టి క్రాపింగ్ మోడల్స్, ఏటీఎం మోడల్స్, డ్రాట్ ప్రూఫ్ మోడల్స్ వంటి ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో ప్రస్తుత వర్షాధార బీడు భూములు, వర్షాధార ఎర్ర నేలలు, నీటి వసతిగల భూములో పండ్ల తోటలలో ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులు పాటిస్తూ ముందస్తు చర్యలు చేపట్టడం మారుతున్న పరిస్థితులకు ఎంతో అనుగుణమన్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధంప్రపంచవ్యాప్తంగా కలిగించేప్రతికూల పరిణామాల్లో వివిధ పంటల ఎగుమతులు, వివిధ రకాల ఎరువుల దిగుమతులపై రైతుల్లో అవగాహనను పెండచం, సరైన సమాచారం రైతులకు చేరవేదయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మర్ యాప్, ఫార్మర్ రిజిస్ట్రీ ఇంకా చేసుకోని రైతులకు దాని ఆవశ్యకతను తెలియజేయడం, ప్రతిరోజూ 90 నుంచి 120 గృహాలను సందర్శించి వ్యవసాయ అనుబంధ రంగాలు అమలు చేస్తున్న వివిధ పథకాలపై రైతుల్లో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖతోపాటు అనుబంధ శాఖలు పాల్గొంటాయని ఏడీఏ ఎస్.సత్యనారాయణ వివరించారు.

## గుత్తిలో ఘనంగా హెరిటేజ్ ర్యాలీ

### - ఆకర్షించిన వేషధారణలు



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**గుత్తి, మార్చి 15 ప్రభాతవార్త**

గుత్తికోట ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం ఘనంగా హెరిటేజ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని జిల్లా రెవెన్యూ అధికారి మలోల ప్రారంభించారు. రైల్వే కార్మికులు, ప్రభుత్వ విభాగాల సిబ్బంది, ప్రజానీకం, కళాకారులు, పురావస్తుశాఖ, పర్యాటకశాఖ, వర్కర్స్ అసోసియేషన్, విద్యార్థులు పెద్దసంఖ్యలో ఈర్యాలీలో పాల్గొన్నారు. గురువయ్యల నృత్యప్రదర్శనలు మేరాతాళాలతో పట్టణంమారుమ్రోగాయి. ఈ సందర్భంగా డిఆర్ఓ మలోల, జిల్లా పర్యాటకశాఖ అధికారి విజయకుమార్ మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ యంత్రాంగం కోట అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ప్రాచీన వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ర్యాలీలో అల్లూరిసీతారామరాజు వేషధారణలో డిఆర్ఓమలోల, శ్రీకృష్ణదేవ రాయలు వేషధారణలో గుత్తికోట సంరక్షణసమితి అధ్యక్షుడు విజయభాస్కర్‌చౌదరి, రుద్రమదేవి వేషధారణలో హేమలత రైల్వే రిటైర్డ్‌ఉద్యోగి రామ గోవిందు వేషదారణలు ప్రజానీకాన్ని అలరించాయి. ర్యాలీ గుత్తి కోట ప్రధాన ద్వారం నుండి కోట వరకు దాదాపు రెండు కిలోమీటర్లు కొనసాగింది. ర్యాలీలో పాల్గొన్న వారికి సిఎస్ఐ ఆర్‌డి, ఎంబిఏ కళాశాల కరస్పాండెంట్ రసెల్ కిరణ్ చర్చి వద్ద నీటి బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పురావస్తుశాఖ అధికారిస్వామినాయక్, మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, తహశీల్దార్ పుణ్యవతి, ఐసిడిఎస్ డైరెక్టర్ శ్రీదేవి, మెప్మా విశ్వజ్యోతి, డాక్టర్ పద్మావతి, ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తారు విందులో పాల్గొన్న పరిటాలశ్రీరామ్

**ధర్మవరంటౌన్ , మార్చి 15 ప్రభాతవార్త**



ఇఫ్తారు విందులో పాల్గొన్న పరిటాలశ్రీరామ్

టీడీపీ ముస్లీం మైనార్టీ సెల్ అధ్యక్షులు అస్లాం నడీమ్ మసీద్, షామీర్ సడిమ్ మసీద్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ ఇఫ్తారు విందుకు నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాలశ్రీరామ్ హాజరయ్యారు. ముస్లింసోదరులతో కలిసి ముందుగా పరిటాలశ్రీరామ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పరిటాలశ్రీరామ్ స్వయంగా భోజనం వడ్డించారు. పరిటాలశ్రీరామ్ మాట్లాడుతూ... పవిత్రమైన రంజాన్ మాసం లో ముస్లీంలు ఎంతో కఠోరమైన ఉపవాసదీక్షలు చేస్తుంటారన్నారు. రంజాన్ మాసం లో ప్రతిఒక్కరు ఎక్కడో ఒక చోట సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. టీడీపీనాయకులు కూడా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. టీడీపీ మైనార్టీల పక్షపాతిగా పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీనాయకులు గోనుగుంట్ల విజయ్ కుమార్, కమతంకాటమయ్య, మహేష్ చౌదరి,ఎల్.నరేంద్రచౌదరి, నాగూర్ హుస్సేన్, రాళ్లపల్లిషరీఫ్, ఫణికుమార్,సంధారాఘవ. జింకాపురుషోత్తం, కొత్తపేట ఆది, జింకలరాజన్న, అత్తర్ రహీంభాష, సమీర్,రావులుచెరువు కుళ్లాయప్ప, రాంపురంశీన, కేశగాళ్లశీన, చట్టాలక్ష్మీనారాయణ, గవ్వలనారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## నిరక్షరాస్యత నిర్మూలన ప్రభుత్వ లక్ష్యం.... ఏరియా కోఆర్డినేటర్..

**రాయదుర్గం టౌన్, మార్చి 15 (ప్రభాతవార్త) :**

గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాసత నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయమని రాయదుర్గం ఏరియా కోఆర్డినేటర్ గోవిందప్ప పేర్కొన్నారు. మండలంలోని అంగన్వాడి, సచివాలయ కేంద్రాలలో 2875 మంది మహిళా సంఘ సభ్యులకు ఉపాధి హామీ కూలీలకు ఉల్లాస్ ఫైనల్ ఎగ్జామ్స్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరు రాయడం చదవడం తప్పనిసరిని ఇందులో భాగంగా 150 మార్కులకు ప్రశ్నపత్రాలు అందించి అభ్యర్థులతో పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ,ఎంపీడీవో, మండల సమైక్య లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ..

మడకశిర టౌన్ మార్చి 15 ప్రభాతవార్త



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే రాజు.

మడకశిర మండల పరిధిలోని వైబిహల్లి గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు జిల్లా అధ్యక్షులు, టిటిడి బోర్డు మెంబర్, ఎమ్మెల్యే రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ: డాక్టర్ బిఆర్,అంబేద్కర్ ఆలోచన విధానాలే ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మహిళల అభ్యున్నతికి బంగారు బాటలని అని తెలిపారు. దేశాభివృద్ధిలో అంబేద్కర్ కృషి ఎంతో ఉందన్నారు.రాష్ట్ర కూటమి ప్రభుత్వం రాజ్యాంగాన్ని అనుసరించి ప్రతి ఒక్కరి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నదన్నారు. ముఖ్యంగా దళితుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,విద్య శాఖమంత్రి నారా లోకేష్ బాబులు అని ఎమ్మెల్యే రాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి గా వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్మన్ నరసింహ రాజు, సర్పంచ్ రామాంజినేయులు. మాజీ సర్పంచ్ చంద్రప్ప, జిల్లా అధికార ప్రతినిధి నాగేంద్ర. రవింద్ర రెడ్డి.కన్వీనర్లు క్లస్టర్ ఇంచార్జ్ నాయకులు. దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పాస్టర్లకు బియ్యం బస్తాలు, నూతన వస్త్రాలు పంపిణీ

## -జీసస్ విజన్ పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్‌కు గౌరవాధ్యక్షుల ఎన్నిక

ఉరవకొండ, మార్చి 15 ప్రభాతవార్త



జీసస్ పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ నూతన గౌరవాధ్యక్షులతో కమిటీ బాధ్యులు

ఉరవకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని పాస్టర్ల కుటుంబాలకు తాడిపత్రికి చెందిన గ్లోరీ టు జీసస్ మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పాల్ కిరణ్ బియ్యం బస్తాలు, నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఆదివారం పట్టణంలోని సాయినగర్‌లోగల హోరేబు మహిమ ప్రార్థన మందిరంలో జీసస్ విజన్ పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పాల్ కిరణ్ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీసస్ విజన్ పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్‌కు గౌరవాధ్యక్షులుగా పాస్టర్ సువర్ణరాజు, పాస్టర్ పరంధామ, పాస్టర్ దేవరాజు, పాస్టర్ జాన్ సుందర్‌ను ఎన్నుకున్నట్లు అసోసియేషన్ ఒక ప్రకటనలో తెలిపింది.



బియ్యం ప్యాకెట్లు, నూతన వస్త్రాలవద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

# నేడు ఉరవకొండ మండల పరిషత్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి

## -అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ ప్రత్యక్ష ప్రసారం వీక్షణకు ఏర్పాట్లు

ఉరవకొండ, మార్చి 15 ప్రభాతవార్త

అమరజీవి పొట్టి శ్రీరాములు 125 జయంతి కార్యక్రమం ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 11 గంటలకు ఉరవకొండ మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి టి.పద్మావతి ఆధ్వర్యంలో జరుగుతుందని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి బి.వి.రవిప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతిలోని స్మృతివనంలో ఏర్పాటైన 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆవిష్కరించనున్నారని ఈక్రమంలో పొట్టి శ్రీరాములు విగ్రహం, చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులల్పించడం జరుగుతుందన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ చారిత్రాత్మక కార్యక్రమాన్ని నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండలోని కాన్స్టిట్యుయెన్సీ విజన్ యాక్షన్ ప్లాన్ (సీవీఏపీ) యూనిట్ నుండి ప్రత్యక్ష ప్రసారం వీక్షించేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 11 గంటల నుండి మధ్యాన్నం 1.30 గంటల వరకు జరుగుతుందన్నారు. స్వర్ణాంధ్ర సాధన సమితి, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

# కార్మికుల సమస్యల పరిష్కారంపై దశలవారి పోరాటం

గుత్తి, మార్చి 15 ప్రభాతవార్త



జిల్లా కార్యదర్శి మాట్లాడుతున్న దృశ్యం

వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దశల వారీగా పోరాటాన్ని కొనసాగిస్తామని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి పేర్కొన్నారు. స్థానిక బీసీ కాలనీలో ఆదివారం సంఘం ఏడవ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు జిల్లా కార్యదర్శి నిర్మల, మండల అధ్యక్ష, కార్యదర్శులు, చందు, మల్లేష్ తదితరులు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దినసరి వేతనం 600 చెల్లించాలన్నారు. స్థానిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఏడాదికి 18 వేలు చెల్లిస్తామన్న హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మద్దిలేటి, రామేశ్వరి, రేణుక, సునీత, రేవతి, నవీన్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# అక్షరాంధ్ర ఉల్లాస్ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ

## - తనిఖీలో పాల్గొన్న ఎంపిడిఓ, ఎంఈఓ



అక్షర ఉల్లాస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

అగళి, మార్చి 15 ప్రభాతవార్త

అక్షరాంధ్ర ఉల్లాస్ కేంద్రాన్ని నిరక్ష రాస్య నిర్మూలన కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. సదరు అక్షరాంధ్ర ఉల్లాస్ పరీక్ష కేంద్రాన్ని అగళి, నర్సాంబుది కేంద్రాలను ఎంపిడిఓ గంగాధర్, ఎంఈఓ కృష్ణమూర్తి రాజులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు ఏ విధంగా రాస్తున్నారు, ఏ విధంగా అభ్యసిస్తున్నారన్న విషయాన్ని తెలుసుకున్నారు.

# నేడు ధర్మవరంలో మంత్రి సత్యకుమార్ పర్యటన...!

ధర్మవరం, మార్చి15, ప్రభాతవార్త



రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకు మారయాదవ్ ధర్మవరం నియోజకవర్గం లో సోమ, మంగళవారాల్లో పర్యటించను న్నట్టు బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జ్ హరీశ్ బాబు తెలిపారు. సోమవారం ఉదయం బత్తలపల్లి మండలం సంజీవపురం కేజీబీవీ పాఠశాలలోనిర్వహించే హెచ్పీవీ టీకాల కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అదేవి ధంగా ఉదయం 1130గంటలకు ధర్మవరం పట్టణంలోని టీటీడీ కల్యాణమండపంలో నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్స వం కార్యక్రమంలో పాల్గొని అనంతరం మద్యాహ్నం 1గంటకు మున్సిపల్ కార్యాల యంలో నిర్వహించే చివరి కౌన్సిల్ సెషన్ కార్యక్రమంలో పాల్గొంటారన్నా రు. 3గంటలకు ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో అంబ్యూఎస్, సత్యసాలు వాటర్ వర్క్స్, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ అదికారులతో నిర్వహించే సమీక్షా సమావేశంలో పాల్గొంటారన్నారు. 17నమంగళవారం ఎన్డీఏ కార్యాల యంలో ఆర్అండ్ బీ, నేషనల్ హైవేస్, ఏపీట్రాన్స్కో, ఇరిగేషన్ సంబంధిత అదికారులతో సమీక్ష, మద్యాహ్నం 2గంటలకు పట్టణంలో నూతనంగా నిర్మించే చేనేత క్లస్టర్, ఆయుర్వేదవైద్య కళాశాల, సద్భవన్ భవన్, బీసీభవన్ నిర్మాణాలకు సేకరించిన స్థలాలను పరిశీంచనున్నారన్నారు.

# రైతు పంచ సూత్రాలు పాటిస్తే వ్యవసాయం లాభదాయకం.....

## ఈనెల 16 నుంచి రైతు సేవా కేంద్రాలలో కార్యక్రమాలు... వ్యవసాయ శాఖ అధికారి శంకర్ నాయక్.

గోరంట్ల మార్చి 15 ప్రభాతవార్త




మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారి

ఆంధ్ర ప్రదేశ్ లోని ప్రతి రైతులతో ప్రత్యక్ష అనుసంధానం ఏర్పరచుకోవడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా నిర్వహించబడుతున్న రైతన్న మీకోసం వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి శంకర నాయక్. ఈ సందర్భంగా పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ బృహత్తర కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతూ ఉందన్నారు.ఇందులో భాగంగానే గోరంట్ల మండలం లో రైతన్న మీకోసం కార్యక్రమం ఈనెల, 16,17,18,23, 24,25 తేదీలలో అన్ని రైతు సేవ కేంద్రాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ముఖ్య ఉద్దేశంఈ కార్యక్రమం ద్వారా రైతుల సంక్షేమం కోసం నిర్వహించబడుతున్న పీఎం కిసాన్ మరియు అన్నదాత సుఖీభవ వంటి సంక్షేమ పథకాలు ప్రతి రైతుకు చేరువగా అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. అదేవిధంగా వ్యవసాయము అనుబంధ శాఖల నిర్వహిస్తున్న సంక్షేమ పథకాలు అనుసరిస్తున్న పంచ సూత్రాలు లపై క్షేత్రస్థాయిలో ప్రతి రైతుకు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత సాగు,సాంకేతిక వ్యవసాయ వినియోగం, ఆహార శుద్ధి పరిశ్రమల విస్తరణ, రైతులకు ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు.ఈ పంచ సూత్రాలను ప్రతి ఇంటికి చేరవేయడమే ముఖ్య ఉద్దేశంలో భాగంగా రైతు సేవా సిబ్బంది, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్,వెటర్నరీ అసిస్టెంట్,ఎనర్జీ అసిస్టెంట్,విలేజ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్, పిఎసిఎస్,ప్రోగ్రెస్ ఫార్మర్,ఏపీ సీఎం ఎఫ్ స్టాఫ్ తదితరులు గ్రామాలలో ఒక టీం గా నిర్వహించుకుని పైన తెలుపబడిన తేదీలలో ప్రతి ఇంటికి చేరి సీఎం సందేశాన్ని వినిపించి వారికి సంక్షేమ పథకాల గురించి వివరించి ఏపీ ఎయిమ్స్ యాప్ నందు ఫోటోలు అప్లోడ్ చేయవలసి ఉంటుంది. ఈ కార్యక్రమం నందు మండల స్థాయి అధికారులు మరియు గ్రామస్థాయి అధికారులు గ్రామ రైతులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొనవచ్చున్నారు.

# నేడు కూటమి నాయకులు కార్యకర్తలు బైక్ ర్యాలీకి తరలిరండి

అమరాపురం మార్చి 15 ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ నాయకుల దృశ్యం

మడకశిర పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ టి.డి.పి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామిల ఆధ్వర్యంలో డ్రగ్స్ వాడడం వల్ల కలిగే అనర్థాలపై, హెల్మెట్ వాడకపోవడం వల్ల జరిగే నష్టాలపై అవగాహన సదస్సును సోమవారం సాయంత్రం 03.30 గంటలకు మడకశిర పట్టణంలో నిర్వహించనున్నట్లు మండల ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు గణేష్, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు రత్నమ్మ నరసింహ మూర్తిలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సత్యసాయిజిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్, సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్., ప్రముఖ సినీ స్టార్ హీరో విష్ణు, ప్రముఖ సినిమా హీరోయిన్ కుమారి. అనన్య నాగళ్ల, ప్రముఖ సినీ నటులు కారుమంచి రఘు హాజరుకానున్నారు. ఇందులో భాగంగా హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీని (బైక్ ర్యాలీ) మధ్యాహ్నం 3.00 గంటలకు మడకశిర పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ నుండి మహాత్మా జ్యోతిబాపూలే సర్కిల్ (అమరాపురం బస్టాండ్) వరకు నిర్వహించి అనంతరం అక్కడేఅవగాహన సదస్సును నిర్వహించడం జరుగుతుంది.ఈ కార్యక్రమానికి మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా యువకులు, విద్యార్థులు, మహిళలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ బైక్ ర్యాలీకి ద్విచక్రవాహనంతో పాటు హెల్మెట్ ను ధరించి రేపు మధ్యాహ్నం 03.00 గంటలకు మడకశిర పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌కు చేరుకోవాలని కావున అమరాపురం మండల కూటమి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనికోరారు.

# కరియమ్మ దేవతకు ఘనంగా పూజలు

అగళి, మార్చి 15 ప్రభాతవార్త



పూజల్లో పాల్గొన్న నాయకులు

మండల పరిధి లోని నందరాజనపల్లి గ్రామంలో వెలసిన పురాతన కరియమ్మ దేవతకు పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేవి మూల విరాట్‌ను వివిధ రకాల పూలతో విద్యుత్ దీపాలతో అలంకరించారు. కరియమ్మ దేవత పూజలో అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. మహా మంగళహారతి అనంతరం ప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉమేష్, సర్పంచు లింగరాజు, మంజునాథ్, హరీష్, భీమన్న, కరియన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నేడు డ్రగ్స్ హెల్మెట్ వాడకం పై అవగాహన ర్యాలీ..

## సినీ ప్రముఖుల రాక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు..

మడకశిర టౌన్ మార్చి 15 ప్రభాతవార్త




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు.

డ్రగ్స్ మహమ్మారి వల్ల యువత నష్టపోతున్న వైనంపై యువతలో అవగాహన పెంపొందించడం కోసం ఎమ్మెల్యే ఎమ్మెల్సీ రాజు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ ర్యాలీకి సినీప్రముఖులు సైతంవిచ్చేస్తున్నారు. డ్రగ్స్‌తోపాటు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకంపై కూడా అవగాహన కల్పించడం కోసం ఈ ర్యాలీ సోమవారం అంబేద్కర్ సర్కిల్ నుండి నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు క్యాంపు కార్యంలో పాత్రికేయులతో మాట్లాడుతూ: ఈ అవగాహన ర్యాలీని విజయ వంతం చేయాలని యువతకు కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. 16 న సోమవారం సాయంత్రం 03.30 గంటలకు మడకశిర పట్టణంలో నిర్వహించనున్నారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅథితులుగా శ్రీసత్యసాయిజిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్,సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్,ప్రముఖ సినీస్టార్ హీరో శ్రీవిష్ణు, ప్రముఖ సినిమా హీరోయిన్ కుమారి.అనన్య నాగళ్ల, హెబ్బాపటేల్ ప్రముఖ సినీనటులు కారుమంచి రఘు హాజరుకానున్నారు అని తెలిపారు. ఇందులో భాగంగా హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీని బైక్ ర్యాలీ మధ్యాహ్నం 3.00 గంటలకు మడకశిర పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ నుండి అమరాపురం బస్టాండ్ వరకు నిర్వహించి అనంతరం అక్కడే అవగాహనసదస్సును నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా డ్రగ్స్‌రహిత సమాజమేధ్యేయంగా యువతతో అవగాహన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎమ్మెల్యే ఎమ్మెస్‌రాజు తెలిపారు. సోమవారం మడకశిర పట్టణంలో పెద్దఎత్తున సినీప్రముఖులతో ర్యాలీనిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువకులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ నరసింహరాజు, జిల్లా అధికార ప్రతినిధి నాగేంద్ర, కౌన్సిలర్ ఉమాశంకర్, బలరాం, విక్రమ్‌లు పాల్గొన్నారు.

# సాయిబాబా ఆలయ నూతన అధ్యక్షుడిగా బంధనాదం సూర్యప్రకాష్..

## మూడోసారి ఎంపిక పట్ల అభినందనలు కమిటీ..

ధర్మవరం రూరల్ మార్చి 15 ప్రభాతవార్త



సమావేశంలో మాట్లాడుతున్న నూతన అధ్యక్షుడు బంధనాదం సూర్యప్రకాష్

శ్రీ శిరిడి సాయి బాబా ఆలయ కమిటీ అధ్యక్షులుగా బంధనాదం సూర్యప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ధర్మవరం పట్టణంలోని సాయినగర్‌లోని బాబా గుడిలో నూతన కమిటీ ఎంపిక కార్యక్రమం జరిగింది. షిరిడి సాయిబాబా ఆలయ కమిటీ అధ్యక్షులుగా బంధనాదం సూర్యప్రకాష్, ఉపాధ్యక్షులుగా రాంప్రసాద్, కోశాధికారిగా శ్రీనివాసులు, కార్యదర్శిగా లింగం కృష్ణమూర్తి, సహకార్యదర్శిగా పూజారి రామాంజనేయులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. వారిచేత ప్రమాణస్వీకారం చేయించారు. నూతన కమిటీ వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి మరింత కృషిచేసి మంచి గుర్తింపు తెస్తామని, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా తాము కృషి చేస్తామని తెలిపారు. ఈ కమిటీ మార్చి 2026 నుంచి 2028 మార్చి వరకు కొనసాగుతుందని తెలిపారు. సమిష్టి కృషితో ఆలయ అభివృద్ధి జరుగుతుందని గత కమిటీ వారి సహకారంతో మరింత అభివృద్ధి బాటలో నడుపుతామని తెలిపారు. గతంలో పనిచేసిన సభ్యులకు ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన కమిటీ వారిని కూడా పాత కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. మూడోసారి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా ఎంపికైన బంధనాదం సూర్య ప్రకాష్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వీరనారాయణ, టి సి.నారాయణరెడ్డి, సూర్యనారాయణ, జి.సి.నాయుడు, రామలింగయ్య, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన చర్యలు తప్పవ్

ధర్మవరంటౌన్ , మార్చి 15 ప్రభాతవార్త



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న టూటౌన్ సీఐ రెడ్డప్ప

ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని టూటౌన్ సీఐ రెడ్డప్ప రౌడీషీటర్లను హెచ్చరించారు. ఆదివారం స్థానిక టూటౌన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎవరైనా సంఘ వ్యతిరేక పనులు చేసిన, పేకాట, మట్కా తదితర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిచర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా దౌర్జన్యాలకు, కబ్జాలకు పాల్పడినవ్యక్తులపైకూడా చట్టప్రకారం చర్యలుతీసుకుంటామన్నారు. ప్రశాంత వాతావరణంలో జీవించాలని అనవసరంగా చిన్నచిన్న గొడవలకుదిగి శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని సీఐతెలిపారు.

# పదవ తరగతి పరీక్షలు నేటి నుండే ప్రారంభం

## - పగడ్బందీగా పరీక్షా కేంద్రాలలో ఏర్పాట్లు- మండల వ్యాప్తంగా 219 మంది హాజరుకానున్న విద్యార్థిని విద్యార్థులు- విద్యార్థినీ విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి:ఎంఈఓలు కృష్ణమోహన్, వెంకటేష్

తాడిమర్రి మార్చి 15 (ప్రభాతవార్త)



వివరాలు వెల్లడిస్తున్న ఎంఈఓలు కృష్ణమోహన్, వెంకటేష్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేటి నుండి (సోమవారం) పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణకు జిల్లా మరియు మండల విద్యాశాఖ అధికారులు పగడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేశారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా త్రాగునీరు, వైద్య సదుపాయంతో పాటు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ లు కృష్ణమోహన్, వెంకటేష్ లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి నుండి నిర్వహించే పదవ తరగతి పరీక్షలకు 219 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. తాడిమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి 69 మంది కస్తూరిబా గాంధీ పాఠశాల నుండి 40 మంది, పిన్నదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి 25 మంది, దాడి తోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి 25 మంది, కునుకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి 20 మంది, ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి 5 మంది, నార్సింపల్లి జేవిఎంఆర్డిటి పాఠశాల నుండి 35మంది, విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను లేకుండా ప్రభుత్వ నిబంధనలను పాటించి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం 9:30 గంటలకు పరీక్షలు ప్రారంభమవుతాయని విద్యార్థులు ఉదయం 8:30 లోపే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

# రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

## -ఉరవకొండ ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో విద్యార్థి సంఘాల ధర్నా -కాలం చెల్లిన మందుల పంపిణీపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్

వార్త ప్రభావం

ఉరవకొండ, మార్చి 15 ప్రభాతవార్త



ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ వెంకటస్వామి చౌదరి



వైద్యాధికారి డాక్టర్ వెంకటస్వామి చౌదరికు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

రోగులకు కాలం చెల్లిన మందులను అందించి వారి ప్రాణాలతో చెలగాట మాడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో శనివారం అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చిన రోగి అబ్దుల్‌కు ఫార్మసీ సిబ్బంది కాలం చెల్లిన మందులను అందించిన విషయమై 'వార్త'లో "ఉరవకొండ ప్రభుత్వాసుపత్రిలో రోగులకు కాలం చెల్లిన మందులు పంపిణీ..!" అన్న శీర్షికన ప్రత్యేక కథనం వెలువడటంతో విద్యార్థి సంఘాల స్పందించాయి. ఉరవకొండ పట్టణంలోని 50 పడకల ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో ఆదివారం వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు సాకే పురుషోత్తం, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుకర్, జిల్లా నాయకులు రాము, ఎంఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేష్, ఎంఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృధ్విరాజ్, ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీ ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి కుమారస్వామి తదితరులు మాట్లాడుతూ రోగాలు నయం చేసుకోవడానికి ఆసుపత్రికి వచ్చే రోగులకు కాలం చెల్లిన మందులను అంటగట్టి కొత్త రోగాలపాలయ్యేలా నిర్లక్ష్యంగా వ్యవహరించి వారి ప్రాణాలతో చెలగాటమాడటం దారుణమని దీనిపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. కాలం చెల్లిన మందులు మింగి ఎవరి ప్రాణాలైనా పోతే ఎవరు బాధ్యత తీసుకుంటారని ప్రశ్నించారు. ఆసుపత్రిలో కొందరు వైద్యులు, సిబ్బంది రోగులపట్ల దారుణంగా ప్రవర్తిస్తున్నారని అనేక పిర్యాదు ఉన్నాయన్నారు. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైన సేవని అనేక మంది దాన్ని మర్చిపోయి రోగులను చీదరించుకొంటూ కొన్నిసార్లు అమానవీయంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి కాలం చెల్లిన మందుల పంపిణీపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోకుంటే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ధర్నా అనంతరం ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ వెంకటస్వామిచౌదరికు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఓబులేసు, ఉలయప్ప తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డె హనుమయ్యను మర్యాదపూర్వకంగా కలిసిన మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు

పరిగి మార్చి 15(ప్రభాత వార్త):



ఇద్దరి ఆత్మీయ కలయిక



ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్న దృశ్యం

శ్రీ సత్య సాయి జిల్లా పరిగి మండల కేంద్రంలోని పార్లమెంటరీ జిల్లా ప్రధాన కార్యదర్శి అయిన వడ్డే హనుమయ్య నుమడకశిర ఎమ్మెల్యే ఎమ్ ఎస్. రాజు మర్యాదపూర్వకంగా కలిశారు అదేవిధంగా నియోజకవర్గాల అభివృద్ధి పైన మరియు ప్రజా సమస్యల పైన చర్చించి ప్రజా సమస్యలను సత్వర పరిష్కార దిశగా అడుగులు వేస్తూ రాబోవు స్థానిక ఎన్నికలపై దృష్టి కేంద్రీకరించాల్సిన సమయమని అత్యధిక మెజార్టీల తో విజయ బావుట ఎగురవేయాలని కాంక్షించారు పరిగి లో వేసవికాలం ని దృష్టిలో ఉంచుకొని ఆదివారం ట్యాంకర్ల ద్వారా త్రాగునీటి సరఫరా కార్యక్రమం చేపట్టారు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమయ్య ప్రజలకు తాగునీటి కొరత లేకుండా ముందస్తుగా చర్యలు చేపట్టి నీరు సరఫరా చేస్తున్నారు ఎండాకాలంలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని తెలియజేశారు ట్యాంకర్లతో నీటిని అందిస్తున్న హనుమాయ్య ను ఎమ్మెస్ రాజు ప్రసంశించారు మంచి పథకాలతో ప్రభుత్వం ముందుకు వెళుతూ ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నారా లోకేష్ పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం సుపరి పాలనవైపు అడుగులు వేస్తూ అభివృద్ధి చెందుతూ ఉందని ఇరువురు నాయకులు తెలియపరిచారు.

# ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంస్థకు ఉగాది పురస్కారం

అనంతపురం రూరల్, మార్చి 15, ప్రభాతవార్త



ఉగాది పురస్కారం అందుకుంటున్న షేక్ చాందిని

నగరంలోని ఆపిల్ ఫంక్షన్ హాల్ నందు మహా యోగ కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు సంస్థ అధ్యక్షుడు యోగా మహేష్ బాబు నేతృతంలో నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంస్థ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ చాందిని ఈ అవార్డును అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మహా యోగ కల్చరల్ సమస్త అధ్యక్షుడు యోగ మహేష్ మాట్లాడుతూ ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ సమాజంలో విద్యార్థులకు అనేక సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తూ పాఠశాల నందు గుడ్ టచ్ బాడ్ టచ్ మరియు మహిళా అక్షరాస్యతకు తోడుపడుతూ, బాల్యవివాహాలపై, క్యాన్సర్ పై అవగాహన కల్పించినందుకు గాను సంస్థకు ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీకి ఈ అవార్డు ఇవ్వడం జరిగిందన్నారు.

04ATP15_04ATP15.qxd 15-03-2026 PM 11:01 Page 1



# పండుగ పూట ముస్లిం సోదరుల నోటి వద్ద ముద్ద లాగిన వ్యక్తి జగన్

## - తాను మంత్రిగా ఉన్న సమయంలోనే రంజాన్ తోఫా ఇచ్చాం - రంజాన్ తోఫా పంపిణీ, ఇఫ్తార్ విందు సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత - పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ తరపున రంజాన్ తోఫా పంపిణీ

అనంతపురం, మార్చి 15 ప్రభాతవార్త బ్యూరో

ముస్లిం సోదరులు అతి పెద్ద పండుగగా జరుపుకునే రంజాన్ రోజు వారి నోటి వద్ద ముద్ద లాగిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో ఆమె రంజాన్ తోఫా పంపిణీ, ఇఫ్తార్ విందు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రం ఆత్మకూరు మండల కేంద్రంలోని కనకదాస కళ్యాణమండపంలో పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక మైనార్టీ నాయకులకు రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సునీత హాజరయ్యారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా సుమారు 200 కుటుంబాలకు, 8 రకాల వస్తువులతో రంజాన్ తోఫా అందజేశారు. అనంతరం స్థానికంగా ఉన్న రెండు మసీదుల్లో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఎమ్మెల్యే సునీతకు స్థానిక మైనార్టీ నాయకులు, మతపెద్దలు ఘన స్వాగతం పలికారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వారికి పండ్లు అందజేసి దీక్షలు విరమింపజేశారు. ఆ తర్వాత ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వయంగా వారికి భోజనం వడ్డించారు. ఉదయం రాప్తాడు మండలం చిన్మయనగర్ కు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త బాష అతని మిత్రుల ఆధ్వర్యంలో అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో రంజాన్ తోఫా పంపిణీ చేశారు. 2వందల ముస్లిం కుటుంబాలకు 6రకాల వస్తువులతో కూడిన రంజాన్ తోఫా కిట్ ను సునీత అందజేశారు. రంజాన్ మాసంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టిన మైనార్టీ నాయకలను ఆమె ప్రత్యేక ంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే పండుగ రంజాన్ అని అన్నారు. తాను పౌరసరఫ రాలశాఖ మంత్రిగా ఉన్న సమ యంలోనే రంజాన్ తోఫాను ప్రారంభించామన్నారు. అప్పుడు ఆ కానుక అందిస్తున్నప్పుడు ముస్లింల కళ్లలో ఆనందం చూశామన్నారు. అయితే జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆ పథకాన్ని రద్దు చేసినప్పుడు ముస్లిం సోదరులు ఎంతో ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చాక మళ్లీ మైనార్టీల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. మరోసారి రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమాన్ని పునఃప్రారంభించేలా ప్రణాళికలు చేస్తున్నట్టు ఆమె తెలిపారు. ఆత్మకూరు మండలం కేంద్రంలోని మసీదుల్లో సమస్యల పరిష్కారం కూడా చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో తాగినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించబోతున్నామని ప్రతి ఇంటికి కొళాయి వస్తుందని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు.



రంజాన్ తోఫాను అందజేసిన దృశ్యం



ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్న ముస్లిం సోదరులు

# సీమ ద్రోహి జగన్ - సీమ నుండి వెలివేయండి

## ప్రజలకు కాలవ పిలుపు చంద్రబాబు తోనే రాష్ట్ర అభివృద్ధి హామీ మేరకు సంక్షేమ పథకాలు అమలు

డి.హిరేహాళ్ మార్చి 15 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాయదుర్గం నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు విస్తారంగా అమలవుతున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కొనియాడారు. ఆదివారం డి.హిరేహాళ్ మండల కేంద్రంలో తెదేపా మండల కన్వీనర్ పాటిల్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రాయదుర్గం నియోజకవర్గానికి "జల్ జీవన్ మిషన్" కింద తాగునీటి పథకాన్ని వర్తింపజేస్తూ రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయంకు అనుగుణంగా కృతజ్ఞతా పూర్వకంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కాలవ ముందుగా ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమం త్రి, ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే కాలవ మాట్లాడు తూ, ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు ఇవ్వాలన్న సంక ల్పంతో జల్ జీవన్ మిషన్ రాయదుర్గం నియోజకవర్గానికి వర్తింప చేయటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎంతో విశాల హృదయంతో ఇంత పెద్ద వరాన్ని తమకి ఇచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రెండేళ్లలో ఈ పథకాన్ని పూర్తిచేసి ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. వాస్తవానికి వెనుక బడ్డ రాయలసీమ ప్రాంతా నికి జల్ జీవన్ మిషన్ 2019 లోనే అప్పటి టీడీపీ ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. అప్పట్లోనే శంకుస్థాపన కూడా చేయటం జరిగిందన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్మో హన్ రెడ్డి ప్రభు త్వం ఈ కార్యక్ర మాన్ని కొనసాగించకుండా సీమకు తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిన పథకాన్ని కొనసా గిం చకుండా రాయలసీమ గ్రామీణుల ఆరోగ్యాలతో, జీవితాలతో జగన్ చెలగాట మాడారని ధ్వజ మెత్తారు. ఇంతటి ద్రోహానికి పాల్పడ్డ నయవంచకుడు జగన్ రెడ్డిని భవి ష్యత్తులో అధికారం దరిదాపుల్లోకి రాకుండా చూసుకోవ లసిన బాధ్యత సీమ ప్రజలపై ఉందని గుర్తుచేశా రు. ప్రజలకు అద్భుతమైన పథకాన్ని దూరం చేసి గ్రామీణుల జీవితాలతో చెలగాటమాడిన జగన్‌ను సీమ నుండి వెలివే యాలని రాయలసీమ ప్రజానీకానికి కాలవ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్ళి రాజు, మార్కెట్ యార్డ్ చైర్మన్ యు.హనుమంత రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్, ఎంపీటీసీ తలారి గంగాధర్, ఎంపీటీసీ మొండి మల్లికార్జున, తిప్పే స్వామి, మాజీ మండల కన్వీనర్లు అంగడి రాజశేఖర్, మాకాశి వెంకటేశులు, తెదేపా సీని యర్ నాయకులు శ్రీరాములు, కల్యం తిప్పేస్వమి, కురుబ తిప్పేస్వామి, గ్రా మ కమిటీ అధ్యక్షులు తాయప్ప, శెట్రూ విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కాలవ



సమావేశం కు హాజరైన ప్రజలు, ప్రజా ప్రతినిధులు

# చెరువులు తోడేస్తున్న పట్టించుకోరా...?

## చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు







రాయదుర్గం టౌన్, మార్చి 15 (ప్రభాతవార్త): రాయదుర్గం పట్టణ సమీపంలోని చెక్ పోస్ట్ వద్ద నాయన చెరువు( నాన్ చెరువు) నుండి మట్టి తవ్వేస్తూ సొమ్ము చేసుకుం టున్నారు. ఏపీ వాటా చట్టానికి తోట్లు పొడవడమే కాక కనీసం అధికారుల అనుమతి కూడా లేకుండా రాత్రి పగలు అనే తేడా లేకు ండా జెసిబిల యంత్రాలతో మట్టిని తవ్వుతూ ట్రాక్టర్ల తో వందల టిప్పర్ల మట్టిని తోడేస్తున్నారు అధికారులు చూసి చూసినట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటుకుల తయారీకి తరచుగా మట్టిని తవ్వేయడమే కాక, పట్టణ ంలోని నడిబొట్టున్న ఓ రాజకీయ నాయకుడు తోటకు వందల సంఖ్యలో మట్టిని తరలిస్తున్నారు అయితే అధికారులు కూడా చూసి చూడన ట్లుగా వ్యవహరించడం పై ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. అక్రమ మట్టి త్రవ్వ కాలు అరికట్టి భూగర్భ జలాలు పెంపొందించేందుకు అధికారులు తగు చర్యలు చేపట్టాలని నాయన చెరువు పరిసర ప్రాంతాల్లో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ డి ఈ గీతాలక్ష్మిను వివరణ కోరగా అక్రమంగా మట్టిని తరలించే వారిపై తగు చర్యలు చేపడతామన్నారు. అనుమతి పొంది ఉంటే వ్యవసాయ పొలానికి మట్టిని తరలించవచ్చు అన్నారు. అనుమతి లేక అక్రమంగా తరలించిన వారిపై చర్యలు చేపడ తామన్నారు.

# రేపు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

## ఏర్పాట్లపై మత పెద్దలతో చర్చించిన టిడిపి అధ్యక్షుడు పూల నాగరాజు , ఎమ్మెల్యే దగ్గుపాటి

**అనంతపురం మార్చి 15 ప్రభాతవార్త**

ఈనెల 17న అనంతపురం నగరంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం ఏర్పాటు చేయ నుంది. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం మైనార్టీలకు ఇఫ్తార్ విందు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు మత పెద్దలతో సమావేశమయ్యారు. ఆదివారం ఆర్.అండ్.బి అతిథి గృహంలో ముస్లిం మైనార్టీల మత పెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతపురం నగరంలోని సాయినగర్ లో ఉన్న అంబేద్కర్ భవన్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రార్థనలు, విందు నిర్వహించాలన్న దానిపై కూలంకశంగా చర్చించారు. మత పెద్దలు, ఇమామ్, మోజన్ల సూచనల మేరకు ఏర్పాట్లు చేయాలని జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు , ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వం ముస్లిం మైనారి టీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని.. అం దుకే ఉపవాస దీక్షల ు ఉన్నవారికి అధికారిక ంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్తువల్లిల సంఘం అధ్యక్షుడు షకీల్ షఫీ , మాజీ గ్రంథాలయ చైర్మన్ జిరాయితీ గౌస్ మోద్దిన్ , టిడిపి మైనార్టీ సంఘం జిల్లా అధ్యక్షుడు సాలా ర్ భాష , మాజీ మున్సిపల్ చైర్మన్ నూరు మహమ్మద్ , టిడిపి జిల్లా కార్యాలయ కార్యదర్శి తాజుద్దీన్ , ముస్లిం మైనార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ముస్లిం మత పెద్దలతో చర్చిస్తున్న టిడిపి అధ్యక్షుడు పూల నాగరాజు, ఎమ్మెల్యే దగ్గుబాటి తదితరులు

# నగర పరిశుభ్రత కోసం 'స్పెషల్ డ్రైవ్'

**మొదటిపేజీ తరువాయి....** రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని లోతట్టు ప్రాంతాల ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ముందస్తు చర్యలు చేపట్టడం అభినందనీయం. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ప్రత్యేకంగా ఒక జెసిబితోపాటు రెండు ట్రాక్టర్లు ఏర్పాటు చేసి మట్టికుప్పలు, చెత్తదిబ్బలను తరలిస్తున్నారు. అలాగే ప్రధాన మురికికాలువల్లో పూడిక, పిచ్చిమొక్కలు తీయడానికి జెసిబిలు వినియోగించుకోవచ్చు. అయితే మధ్యతరహా కాలువల్లో పేరుకుపోయిన పూడికను తీయడానికి నగరంలోని వాటిని గుర్తించి ప్రత్యేక కూలీల ద్వారా పూడికను తీయించి తరలించడానికి టెండర్ ప్రక్రియ ద్వారా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో ప్రధానంగా వర్షాలు అధికంగా వచ్చినపుడు ముంపుకు గురయ్యే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అలాగే నగర శివారు ప్రాంతాలతో పాటు వర్షం పడినపుడు ఎక్కడెక్కడ వర్షపు నీరు అధికంగా ప్రవహిస్తుందో ఆ ప్రాంతాలను టార్గెట్‌గా చేసుకుని వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వుండేందుకు ఈ యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపడుతున్నారు. గతంలో వర్షాలు వచ్చి ప్రధాన కాలువలతో పాటు మధ్యతరహా కాలువల్లో వర్షపు నీరు సజావుగా ప్రవహించని దుస్థితి నెలకొన్న విషయం తెలిసిందే. ?ఇలాంటపుడు పాలకులు, అధికారులు అత్యవసర నిమిత్తం ప్రత్యేక జెసిబిలు, టాక్టర్లు ఏర్పాటు చేసుకుని హడావిడి చేస్తూ అత్యవసరం పేరుతో లక్షలాది రూపాయలు స్వాహా చేయడం ఆనవాయితీగా చెప్పుకోవచ్చు. అయితే ప్రస్తుతం ముందస్తుగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్ వల్ల వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టడం ఎంతో అభినందనీయంగా చెప్పవచ్చు.

స్పెషల్ డ్రైవ్ చేపట్టడంపై 'ప్రభాతవార్త'తో కమిషనర్ ఎం.జస్వంతరావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సూచన మేరకు వర్షాకాలంలో నగర ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా మందస్తు చర్యలు తీసుకోవడం ఆనవాయితీగా చెప్పుకొచ్చారు. అలాగే మధ్యతరహా కాలువల్లో పూడిక తీయడం చిన్నపాటి జెసిబిలతో కాకపోవడం వల్ల ఆ కాలువల్లో టెండర్ ద్వారా ప్రత్యేక కూలీలను ఏర్పాటు చేసి పూడిక తీయిస్తామన్నారు. దీంతో మురికినీరు సజావుగా పారుతుందని, వర్షాలు వచ్చినా ఎలాంటి ఇబ్బందులు వుండవని, పిచ్చిమొక్కలు తొలగించడం వల్ల దోమలను సైతం కొంతమేర నియంత్రించవచ్చన్నారు. త్వరలో ఖాళీ స్థలాల్లో ఏపుగా పెరుగుతున్న పిచ్చిమొక్కలను స్థల యజమానులు శుభ్రం చేసుకునేలా చర్యలు చేపడతాని కమిషనర్ వివరించారు.



కమిషనర్ జస్వంతరావు

# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు... ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు

## ముస్లింలకు ఎమ్మెల్యే రాజు ఇఫ్తార్ విందు.. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు సోదర భావంతో జీవించాలి

మడకశిర టౌన్ మార్చి 15 ప్రభాతవార్త.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని జిల్లా అధ్యక్షులు, టిటిడి బోర్డు మెంబర్, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని మసీదు సమీపంలో ఉన్నటువంటి ఓ మైదానంలో దాదాపు మడకశిర నియోజకవర్గం నుండి 1,500 మంది ముస్లింలకు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా ముస్లిం సోదరులకు ఇతర విందులో భోజనం వడ్డించారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ఉపవాస విరమణ చేశారు. అనంతరం అందరితో కలిసి భోజనం చేసి రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ :రంజాన్ ముస్లిం సోదరులకు పవిత్ర మాసమన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించే ముస్లిం సోదరులకు ఇచ్చే ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. రంజాన్ పర్వదినం ఐక్యత, సహనం, సేవ భావాలను గుర్తు చేసే పవిత్రమైన కాలమని పేర్కొన్నారు. ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతికలుగా నిలుస్తాయని అన్నారు. భక్తిశ్రద్ధలతో ముస్లిం సోదరులు అత్యంత భక్తి నిర్వహించుకునే గొప్ప పండుగ రంజాన్ పండుగ అని తెలిపారు. నెల రోజులపాటు ఉపవాస దీక్షలు చేసిన ప్రతి ఒక్కరి కోరికలు నెరవాలని అల్లాను ప్రార్థించారు. ముస్లింలు ఆర్థిక, రాజకీయ, సామాజిక, విద్య రంగాల్లో వెనుకబడిన పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర కూటమి ప్రభుత్వం వారికి ప్రోత్సాహం అందిస్తుందన్నారు. మైనారిటీ కార్పొరేషన్ ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ముస్లిం సోదరులందరికీ ఎల్లప్పు డూ అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ రంజాన్ పండుగ ముస్లిం సోదరుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ ఇతరు విందు నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ చైర్మన్ నరసింహ రాజు.రాష్ట్ర వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీ నారాయణ. మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ భక్తర్. జిల్లా అధికార ప్రతినిధి నాగేంద్ర. కౌన్సిలర్లు ఉమాశంకర్. రమేష్.విక్రమ్. బలరాం హనుమంతు. పట్టణ,మండల కన్వీనర్లు నాగరాజు. మజీద్ ముత్తవల్లి మహబూబ్ బాషా. ముస్లిం మత పెద్దలు.ముస్లిం సోదరులు ఆదిల్. దాదా పీర్. లతీఫ్. బాబు. తదితరులు పాల్గొన్నారు.



ముస్లిం సోదరులతో పాటు ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు.



ముస్లింలకు ఇఫ్తార్ విందులో అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే రాజు.

# అడుగంటుతున్న భూగర్భ జలాలు

## - మడకశిర రైతులు విలవిల వక్క తోటలను కాపాడుకోవడానికి కొత్త బోర్లు - అప్పుల పాలవుతున్న రైతులు

గుడిబండ మార్చి 13 ప్రభాతవార్త

మడకశిర నియోజకవర్గంలో గత ఏడాది నుండి వర్షపాతం తీవ్రంగా తగ్గి భూగర్భ జలాలు అడుగంటడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయి పలు గ్రామాల్లో బోర్లు ఎండిపోయాయి. దీంతో సాగునీటి కోసం రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు.ఈ ప్రాంతంలోని రైతులు సాగు చేస్తున్న వక్క తోటలను కాపాడుకోవడానికి కొత్తగా లోతైన బోర్లు వేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే ఉన్న బోర్లలో నీరు లేకపోవడంతో రైతులు లక్షల రూపాయలు ఖర్చు చేసి కొత్త బోర్లు వేస్తున్నారు. అయితే కొత్తగా వేసిన బోర్లలో కూడా చాలాచోట్ల నీరు లభించ కపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.ఒక బోరు వేయడానికి దాదాపు రెండు నుండి మూడు లక్షల రూపాయల వరకు ఖర్చవుతుండటంతో రైతులు అప్పులు చేసి బోర్లు వేయించుకుంటున్నారు. కానీ నీరు దొరకక పోవడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకు పోతున్నారు.మరోవైపు వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో భూగర్భ జలాలు మరింత తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు.ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని మడకశిర నియోజకవర్గం రైతాంగం సాగునీటి సమస్యను పరిష్కరించడానికి ప్రత్యేక చొరవ తీసుకో వాలని బోర్లు వేయించుకునే రైతులకు సబ్సిడీ అందించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.వర్షాభావం కారణంగా పంటలు ఎండిపోతాయనే భయం తో రైతులు రోజు రోజుకు ఆందోళనకు గురవుతుండటం ఈ ప్రాంతంలో కనిపిస్తోంది. వెంటనే సాగునీటి సౌకర్యం కోసం ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోతే ఈ ప్రాంత రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారే అవకాశముందని రైతులు వాపోతున్నారు. చెరువులకు హంద్రీనీవా జలాలు అందించాలి రైతు సోమశేఖర్ చిగతుర్పి మూడు ఎకరాల భూమిలో వెయ్యి వక్కచెట్లను నాటాను పంట చేతికొచ్చే సమయంలో బోర్లలో నీరు అడుగంటి పోయాయి. చెట్లను కాపాడుకోవడానికి దాదాపు పది లక్షల రూపాయలు ఖర్చు చేసి ఆరు బోర్లను వేయించాను. వెయ్యి అడుగులు తవ్వినా ఒక్క చుక్క నీరు కూడా రావట్లే దు.కావున ప్రభుత్వం చొరవ తీసుకుని ఈ ప్రాంతంలో చెరువులను హంద్రీ నీవా జలాలతో నింపితే భూగర్భ జలమట్టం పెరిగే అవకాశం ఉంది.



బోరు వేస్తున్న దృశ్యం



రైతు సోమశేఖర్

# వర్షపు నీటి సంరక్షణకు శ్రీకారం

## - మనపల్లె-మననీరు కార్యక్రమం ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే

కదిరి, మార్చి 15 ప్రభాతవార్త

జిల్లాలో వర్షపు నీటి సంరక్షణను బలోపేతం చేసే దిశలో మన పల్లె మన నీరు కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటి సంరక్షణ పనులకు శ్రీకారం చుట్టినట్లు జిల్లా కలెక్టర్ శాం ప్రసాద్ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌లు పేర్కొన్నారు. ఆదివారం కదిరి రూరల్ మండలంలోని దిగువ చెరువు-కాల సముద్రం సరఫరా కాలువ పనులు పునరుద్దరణకు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దిగువ చెరువు-కాల సముద్రం కాలువ పనులు సుమారు 7 కిలోమీటర్ల పొడవు 1.60 మీటర్ల వెడల్పుతో ఉంటుందని వర్షపు నీరు వృథా కాకుండా చెరువులకు నీటిని మళ్లించడం ద్వారా భూ గర్భ జల మట్టం పెంచి సాగునీరు రైతులకు అందించడం జరుగుతుందన్నారు. ఈ కాలువ ద్వారా ప్రదానంగా 3 చెరువులకునీటి లభ్యత పెరుగుతుందని, దిగువ చెరువు 119.24 నేరుగా, పరోక్షంగా 9.98ఎర్రొడ్డు చెరువు, 39.77, 0.78 శ్రీ రంగనాయుని చెరువు 536, 98.25 ఈ పనులు పూర్తి కావడం వల్ల సాగునీటి సౌకర్యం మెరుగు పడటమే కాకుండా పరిసర ప్రాంతాల్లో భూ గర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వివిఎస్ శర్మ, తహశీల్దారు రెడ్డిశేఖర్, ఎంపిడిఓ పోలప్ప, స్వచా ంంధ్ర కమిషనర్ రాష్ట్ర డైరెక్టర్ పర్వీన్‌భాను, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మనపల్లి, మన నీరు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శాం ప్రసాద్, ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

# వేసవి తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

శ్రీ సత్య సాయి జిల్లా, మార్చి 15, ప్రభాతవార్త ప్రతినిధి

కలెక్టరేట్ లోని మినీ కన్ఫారెన్స్ హాలు నందు జిల్లాలో గ్రామీణ స్వచ్ఛ భారత్ మిషన్ పనులు, అంగన్‌వాడీ కేంద్రాలలో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాల పురోగతి, వేసవి తాగునీటి సంసిద్ధతపై కార్యనిర్వాహక ఇంజనీర్ ఆర్డబ్ల్యూఎస్ (ఎస్) పెనుకొండ డివిజన్ అధికారులతో జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్బిఎంజి) జిల్లాలో మంజూరైన 4,923 వ్యక్తిగత మరుగుదొడ్లలో (ఐ హెచ్ హెచ్ ఎల్) ఇప్ప టివరకు 3,725 పనులు పూర్తయ్యాయని, మిగిలిన 1,198 పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఐసిడిఎస్ నిధులతో జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించే పనులను వేగవంతం చేయాలని అధికారుల ను ఆదేశించారు.

ఎస్ బి ఎం, ఐసిడిఎస్ గ్రాంట్ల కింద జిల్లా వ్యాప్తంగా అంగ న్వాడీ మరుగుదొడ్ల నిర్మాణాల్లో 52.15 పురోగతి నమోదైందని, తాగునీటి వసతి కల్పనలో 89.84 పనులు పూర్తయ్యాయని కలెక్టర్ వెల్లడించారు. ముఖ్యంగా మడకశిర సబ్‌డివిజన్‌లో 130 అంగన్ వాడీ కేంద్రాలకు తాగునీటి సౌకర్యం కల్పించగా, అందులో 127 పనులు ఇప్ప టికే పూర్తయ్యా యని తెలిపారు. మార్చి నుండి జూలై 20 26 వరకు తాగునీటి ఎద్దడి నివా రణకు రూ.299.37 లక్ష లతో ప్రణాళికలు సిద్ధం చేసిన ట్లు తెలిపారు. కరువు ప్రభా విత, ఇతర మండలాల్లో 99 నివాస ప్రాంతాలకు నీటి రవాణా కోసం రూ. 210.92 లక్షలు కేటాయించడం జరిగింది. మడకశిర నియోజక వర్గం లోని గ్రామ పంచాయతీలకు వారం రోజుల్లోగా తాగు నీటి ట్యాంకర్లను సమకూ ర్చాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. మండల పంచాయతీ కార్యదర్శులతో కలెక్టర్ ఫోన్ ద్వారా మాట్లాడి, రక్షిత తాగునీటి పథకాల నిర్వహణ, బోర్ల ఫ్లషింగ్ పనులను తనిఖీ చేశారు.ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా క్షేత్రస్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

# ముస్లింలకు పవిత్రమైన పండుగ రంజాన్

## మతసామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందు - ముస్లిం సోదరులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్నారై కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం మార్చి 15 ప్రభాతవార్త

ముస్లింలకు ఎంతో పవిత్రమైన పండుగ రంజాన్ మాసమని వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్నారై కో ఆర్డినేటర్ ఆలూరు సాంబ శివారెడ్డి తెలిపారు. ఉపవాస దీక్షలు,ప్రార్థనలు దానధర్మాలతో రంజాన్ మాసం ముస్లిం లకు ఆధ్యాత్మికంగా ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఎస్ఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో శింగనమల మాజీ శాసన సభ్యరాలు జొన్నలగడ్డ పద్మావతి,వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఘనంగా ఇస్తార్ విందు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఆయన ముస్లిం సోదరులతో కలిసి నమాజ్‌లో పాల్గొన్నారు.అనంతరం అందరికీ ముందస్తుగా రంజాన్ శుభాకా ంక్షలు తెలియజేస్తూ,అల్లా చల్లని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసం తోషాలతో ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.అలాగే మత సామరస్యాన్ని కాపాడుతూ అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉర్దూ అకా డమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, పొలిటికల్ అడ్వైజర్ కమిటీ నెంబర్ (పీఎస్‌సభ్యులు) ఎస్‌యండి ఇస్మాయిల్,వైస్సార్సీపీ మైనారిటీ జిల్లా అధ్యక్షుడు సైపుల్లా,ముస్లిం మత పెద్దలు,రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్య క్షులు ప్రధానకార్యదర్శి మిద్దెకు ళ్ళాయప్ప, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసు నాయక్, బొమ్మనశ్రీరామిరెడ్డి, నరేంద్రరెడ్డి, గోవిందపల్లి పుల్లారెడ్డి, రాధమనోహర్‌రెడ్డి తోపాటు వైసీపీ నాయకులు కార్యకర్తలు తదితిరులు పాల్గొన్నారు.



ముస్లిం సోదరులకు భోజనం వడ్డిస్తున్న సాంబశి

# జిల్లాలో గ్యాస్ కొరత లేదు

## - కృత్రిమ గ్యాస్ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు - జిల్లా కలెక్టర్ ఆనంద్

గుత్తి, మార్చి 15 ప్రభాతవార్త

జిల్లా వ్యాప్తంగా గ్యాస్ కొరత లేదని, 17 వేల మెట్రిక్ టన్నుల ఎల్‌పిజి గ్యాస్ అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ ఆనంద్ స్పష్టం చేశారు. గుత్తికోట ఉత్సవాలకు జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్యాస్ కొరత ఉందంటూ సోషల్ మీడియా, ఇతర ప్రసార మాధ్యమాల్లో జరుగుతున్న వదంతులను ప్రజలు నమ్మరాదని ఆయన కోరారు. ఏదైనా గ్యాస్ ఏజెన్సీ గాని, ఇతరులు గాని అక్రమంగా ఎల్‌పిజి గ్యాస్‌ను నిల్వ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. గ్యాస్ పంపిణీ పట్ల ప్రజలు ఎలాంటి ఆందో ళనకు గురికా రాదని, గత ంలో మాదిరిగానే గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని ఆయన సూచించారు. కృత్రిమంగా గ్యాస్ కొరత ను సృష్టిం చిన పక్షంలో కఠిన చర్యలు చేపడతా మని కలెక్టర్ హెచ్చరించారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆనంద్